తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఆదివారం

25 జనవరి, 2026



# వన దేవతల
# జనజాతర

# 'కిస్' స్టార్ రుణానుబంధ రూపేణా..!



శ్రీలీల అంటే కేవలం వెండితెరపై మెరిసే గ్లామర్, అద్భుతమైన డాన్స్ మాత్రమే కాదు. ఆమెలో ఎంతో సున్నితమైన మనసు, సేవా గుణం కూడా ఉన్నాయి. స్టార్ హీరోయిన్‌గా కెరీర్‌లో దూసుకుపోతున్న ఈ బ్యూటీ, 24 యేళ్ల వయసులోనే ముగ్గురు పిల్లలను దత్తత తీసుకుని అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. తెరపై నటిగా అలరిస్తూనే, తెర వెనుక బాధ్యతగల పౌరురాలిగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. అమ్మలా కాదు.. ఒక ప్రత్యేక బంధం.

ఈ దత్తత విషయంపై తాజాగా స్పందించిన శ్రీలీల, తన మనసులోని భావాలను పంచుకుంది. ఈ విషయం గురించి మాట్లాడేటప్పుడు నాకు మాటలు రావు, కాస్త వణుకుగా కూడా ఉంటుంది. కానీ ఆ పిల్లలను నేను అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నాను. నేను వాళ్లకు ఒక సాధారణ అమ్మలా ఉండను, దానికి ఒక ప్రత్యేకమైన కథ ఉంది.. అంటూ తన ప్రయాణం గురించి ఎమోషనల్‌గా వివరించింది. తన కెరీర్ ఆరంభంలో 'కిస్' సినిమా సమయంలో ఒక ఆశ్రమానికి వెళ్ళినప్పుడు ఆ పిల్లలతో ఏర్పడిన అనుబంధమే ఈ నిర్ణయానికి కారణమని ఆమె తెలిపింది. నిజానికి ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలని అనుకున్నప్పటికీ, మరికొంత మందిలో సేవా భావం కలగాలనే ఉద్దేశంతోనే బయటకు చెప్పినట్లు వెల్లడించింది. 2022 లోనే ఇద్దరు దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకున్న శ్రీలీల గొప్ప మనసున్న నిజమైన స్టార్.

# రెహ్మాన్ తెరంగేట్రం!

తారాతీరం

ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ తన అభిమానులకు భారీ సర్‌ప్రైజ్ ఇవ్వనున్నారు. దశాబ్దాలుగా తన సంగీతంతో కోట్లాది మందిని ఉర్రూతలూగించిన ఆయన, ఇప్పుడు వెండితెరపై నటుడిగా ఆరంగేట్రం చేస్తున్నారు. ప్రభుదేవా ప్రధాన పాత్రలో మనోజ్ ఎన్.ఎస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మూన్‌వాక్' చిత్రంలో రెహ్మాన్ నటించనున్నారు. బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన క్యారెక్టర్ పోస్టర్లు తాజాగా విడుదలై ఆసక్తిని రేపుతున్నాయి. విశేషమేమిటంటే.. ఈ చిత్రంలో రెహ్మాన్ సంగీత దర్శకుడిగా కాకుండా, ఒక కల్పిత పాత్రలో కనిపించనున్నారు. ఆయన ఇందులో ఓ 'కోపమున్న యువ దర్శకుడి' పాత్రను పోషిస్తున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. అంతేకాకుండా, తన కెరీర్‌లో తొలిసారిగా ఈ సినిమాలోని మొత్తం ఐదు పాటలను రెహ్మానే స్వయంగా పాడటం మరో విశేషం. ఈ సందర్భంగా దర్శకుడు మనోజ్ ఎన్.ఎస్‌మాట్లాడుతూ, ప్రభుదేవా, ఏఆర్ రెహ్మాన్‌లతో కలిసి 'మయిలే' అనే పాటను షూట్ చేయడం అద్భుతమైన అనుభవం. ఈ పాటలో రెహ్మాన్ సార్ కనిపిస్తారు. ఆ తర్వాత నేను చెప్పిన కథ నచ్చడంతో ఆయన సినిమాలో ఒక పూర్తి స్థాయి సన్నివేశంలో నటించడానికి ఒప్పుకున్నారు.



ఇది ప్రేక్షకులకు కచ్చితంగా సర్‌ప్రైజ్ ఇస్తుంది అని తెలిపారు. ఇక ఈ చిత్రంలో ప్రభుదేవా 'బాబుట్టి' అనే యువ కొరియోగ్రాఫర్ పాత్రలో నటిస్తుండగా, ప్రముఖ కమెడియన్ యోగి బాబు ఏకంగా మూడు విభిన్న పాత్రల్లో (కవరిమాన్ నారాయణన్, ఆట్టుక్కాల్ అళగు రాజా, దుబాయ్ మాథ్యూ) కనిపించనున్నారు. వీరితో పాటు అర్జున్ అశోక్, అజువర్గీస్, రెడిన్ కింగ్స్‌లే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం 2026 మే నెలలో థియేటర్లలో విడుదలయ్యే అవకాశం ఉంది.

ఆదివారం వార్త

25 జనవరి, 2026

## మంచి ముత్యాలు

– పర్వత శిఖరాలలాగా మహా మేధావులు సూర్యోదయాన్ని ముందుగా గ్రహించి ప్రతిబింబిస్తారు. – టి.బి.బ్యారన్ మెకాలే

– పోరాటం ద్వారా లక్ష్యసిద్ధి జరిగితే పోరాటం మంచిదే. – చాణక్యుడు

## కదంబం

'సంఘీ'భావం....5

దేశంలో డిజిటల్ అరెస్టుల జోరు

కవర్ స్టోరీ..6

వన దేవతల జనజాతర

ఈ వారం కవిత్వం.. 11

జ్ఞాపకాల జడి

కథ..20

సప్తపది

పెరుగుతున్న పర్యాటకం... 24

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..

# సమాచారం

## ఆరోగ్యంగా ఉండాలంటే!

శారీరక, మానసిక ఆరోగ్యం బాగుండాలంటే వ్యాయామం ఎంతో అవసరం. ప్రతి రోజు పది వేల అడుగులు నడవాలి, లేదంటే 45 నిమిషాలు వ్యాయామం చేయాలని నిపుణులు అంటున్నారు. పదివేల అడుగులు అనేది సులభమైన వ్యాయామం. రోజుకు పది వేల అడుగులు నడవడం ద్వారా శరీరంలో రక్తప్రసరణ, జీర్ణ వ్యవస్థ మెరుగవుతాయి. గుండె ఆరోగ్యం బాగుంటుంది. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. అయితే ఒకేసారి ఇంత దూరం నడవాల్సిన అవసరం లేదు. అడుగులను కొన్ని భాగాలుగా చేసి రోజులో వీలు కుదిరినప్పుడల్లా చేయొచ్చు.

ఉదయం ఒక అరగంట/గంట నడిస్తే సగానికి పైగా టార్గెట్ పూర్తి అవుతుంది. ఆఫీసులో లిఫ్ట్ ఎక్కే బదులు మెట్లమార్గం ఎంచుకోవాలి. రాత్రి భోజనం చేసిన తర్వాత మరో పావుగంట నడిచి లక్ష్యాన్ని పూర్తి చేయొచ్చు. అయితే నడకతోనే కండరాలు బలంగా మారవు. ఫిట్‌గా అవడానికి ఎక్కువ సమయం పడుతుంది. అదీ క్రమం తప్పకుండా నడవాలి.

జిమ్‌లో వర్కౌట్స్, కార్డియో, సైక్లింగ్ వంటివి ఏవైనా చేయొచ్చు. ఈ 45 నిమిషాల వ్యాయామంతో తకునకవ సమయంలో ఎక్కువ క్యాలరీలు కరుగుతాయి. దీంతో తొందరగా బరువు తగ్గే అవకాశం ఉంది. శరీరంలోని కండరాలు దృఢంగా మారడంతో పాటు శక్తి లభిస్తుంది. ఫిట్‌గా ఉండటంతో మానసిక ప్రశాంతత పొందుతారు. మంచి నిద్ర పడుతుంది. ఉదయం లేదా సాయంత్రం జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేయడం, ఇంట్లోనే కార్డియో, యోగాసనాలు లాంటివి చేయవచ్చు. సైక్లింగ్ చేస్తూ శరీరానికి శ్రమ కల్పించవచ్చు. తేలికపాటి వ్యాయామాల నుంచి క్రమంగా కఠిన వ్యాయామాలు చేయడం ఉత్తమం. ఒకేసారి కఠినమైనది చేస్తే కొత్త ఇబ్బందులు ఎదురవుతాయి. జిమ్‌లో అయితే ట్రైనర్ శిక్షణ ఇస్తారు. సాధారణ, నిలకడైన ఆరోగ్యం కోసం పది వేల అడుగులు నడిస్తే సరిపోతుంది. కాస్త తొందరగా బరువు తగ్గాలి, కండరాలు దృఢంగా మారాలనుకుంటే 45 నిమిషాల వ్యాయామం మంచిది. సంపూర్ణ ఆరోగ్యం, ఫిట్‌నెస్ కావాలంటే రెండూ చేయొచ్చు. ఏది చేసినా క్రమం తప్పకుండా చేస్తేనే ఫలితాలు లభిస్తాయి.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# ఆ ఊళ్లో ఒకే ఒక్క ఇల్లు..

నిర్మానుష్య ప్రాంతంలో కాసేపు ఉండాలంటేనే భయంతో వణుకు వచ్చేస్తుంటుంది. అలాంటిది కనుచూపుమేరలో మనుషులే కనిపించని ఓ మారుమూల గ్రామంలో ఓ కుటుంబం కొన్నేళ్లుగా నివసిస్తోంది. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే– ఆ గ్రామంలో ఉన్నది ఒకే ఒక్క ఇల్లు.

హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్–స్పితి జిల్లాలో 'కక్తి' అనే ఓ గ్రామం ఉంది. ఇది దేశంలో ఒక్క కుటుంబం మాత్రమే నివసిస్తున్న గ్రామంగా గుర్తింపు తెచ్చుకుంది. హిమాలయ పర్వతాల మధ్య ఉన్న ఈ గ్రామంలో త్సెరింగ్ నమ్‌గ్యాల్ కుటుంబ జీవనం సాగిస్తోంది.

ఈ గ్రామం స్పితి వ్యాలీ హెడ్ క్వార్టర్స్ కాజాకు పది కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ త్సెరింగ్ కుటుంబం తమ పూర్వీకులు వందేళ్ల క్రితం బురద, మట్టి, రాతితో నిర్మించిన ఇంట్లోనే ఉంటోంది. చిన్న తలుపులు, సంప్రదాయ నిర్మాణ శైలితో దీన్ని నిర్మించారు. ఈ ఇంట్లో వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటుంది. బయట మైనస్ 20 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలున్నా ఇంటిలోపల సురక్షితంగా ఉండగలుగుతున్నారు. త్సెరింగ్ జల్‌శక్తి శాఖలో ఉద్యోగి. అటు



విధులు నిర్వర్తిస్తూనే వారసత్వంగా వచ్చిన కొంత భూమిలో వ్యవసాయం చేయడంతో పాటు పశువులను పెంచుతున్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సోదరుడు బౌద్ధ గురువుగా మారి కాజాలోని ఒక బౌద్ధ మఠంలో సేవలందిస్తున్నాడు.

లాహౌల్–స్పితి ప్రాంతం శీతాకాలంలో పూర్తిగా మంచులో కప్పబడి ఉంటుంది. దీంతో చలికి తట్టుకోలేక ఇక్కడ నివసించే ప్రజలు కులు–మనాలి, మండికి వలస వెళ్తుంటారు.

కానీ, కక్తి గ్రామంలో ఉన్న త్సెరింగ్ కుటుంబం మాత్రం ఈ గడ్డు పరిస్థితులను తట్టుకుంటూ నగ్రామంలోనే జీవిస్తోంది. "మాకు స్పితిలోయ అంటే చాలా ఇష్టం. నగరాల్లోని గందరగోళం మాకు నచ్చదు. ఐదు తరాలుగా మేం ఇక్కడే జీవిస్తున్నాం. ఇంట్లో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే ప్రభుత్వం హెలికాప్టర్ ద్వారా సహాయం అందచేస్తుంది. కానీ ఇప్పటివరకు మాకు ఆ పరిస్థితి రాలేదు. శీతాకాలంలో అప్పుడప్పుడు మేం మండి జిల్లాలోని రెవాల్సర్ లేదా ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ వెళ్తాం. కొన్ని రోజులు ఉండి తిరిగి ఇంటికి వచ్చేస్తాం" అని త్సెరింగ్ అంటున్నాడు.

కక్తి గ్రామంలో చలికాలంలో నీటి వనరులన్నీ మంచులా గడ్డకట్టుకుపోతాయి. ఆ మంచును కరిగించి మళ్లీ నీరులా వినియోగిస్తుంటారు. ఇలాంటి వాతావరణంలో బయటకు వెళ్లడం కష్టమే. అందుకే ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, మందులు, పశువుల మేత.. ఇలా అన్నీ ముందుగా తెచ్చుకొని నిల్వ చేసుకుంటారు. వీరి పంటపొలంలో పండే బంగాళాదుంపలు ఢిల్లీ వరకు ఎగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రామం అధికారికంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని, అందుకే ఇక్కడి కుటుంబానికి ప్రభుత్వం వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్లు తెలుస్తోంది.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

## 'సంఘీ' భావం



# దేశంలో డిజిటల్ అరెస్టుల జోరు

సైబర్ నేరగాళ్లు అక్రమ మార్గాల్లో డబ్బును దోచుకోవడానికి అనేక విధానాలను అన్వేషిస్తారు. అందులో ప్రధానమైనది డిజిటల్ అరెస్ట్. కేవలం ఎదుటివారిని బెదిరించడం ద్వారా వారి నుంచి డబ్బును సాధ్యమైనంత వరకు దోపిడీ చేయడమే వీరి లక్ష్యం. సైబర్ నేరాలు ఏ రకానికి చెందినప్పటికీ వాటికి గుర్తై మోసపోతున్నామంటే కేవలం బాధితుల ఆలోచనల్లో తప్పిదాలే అని చెప్పవచ్చు. ఎవరో ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేస్తామని చెప్పడంతో బెదిరిపోవడం, మరొకరు బ్యాంక్ అకౌంట్లు, ఓటిపీలు చెప్పాలని కోరడంతో వారికి ఆయా వివరాలు ఇవ్వడం వంటివి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. స్టాక్ఎక్స్ఛేంజిలో డబ్బు పెడితే పది రెట్లు ఇస్తామని చెప్పడంతో మరికొందరు ఈ మోసాలకు బలి అవుతున్నారు. అసలు అది సాధ్యమేనా అని కొంతైనా ఆలోచన చేయకుండా మోసపోతున్నారు. ముందుగా సైబర్నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. డిజిటల్ అరెస్ట్ గురించి పరిశీలిస్తే అసలు అలాంటి ప్రక్రియ పోలీసు విభాగంలో లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు శాఖలోని వివిధ విభాగాల అధిపతులు, సైబర్ నిపుణులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ రాగానే భయపడి లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు వారికి ముట్టజెబుతున్నారు. మీ ఆధార్ నెంబరు నుంచో, బ్యాంక్ అకౌంట్ నుంచో అక్రమ లావాదేవీలు జరిగాయని సైబర్నేరగాళ్లు ఫోన్ చేయగానే నిజమని నమ్ముతున్నారు. తాము అలాంటివి చేయలేదని ఆధారాలు చూపించాలని అడగాల్సి న బాధ్యత బాధితులపై ఉంది. అంతేకాకుండా విదేశాల నుంచి తమ పేరుపై ఒక పార్సిల్ వచ్చిందని, అందులో కోట్ల రూపాయల డ్రగ్స్ ఉన్నాయని సైబర్నేరగాళ్లు చెబుతారు. తమకు ఈ లావాదేవీలతో సంబంధం లేదని, విచారణకు ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇస్తానని చెప్పే కనీస జ్ఞానాన్ని కోల్పోతున్నారు. దీనితో సైబర్ నేరాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి.ఒకసారి గత మూడేళ్లగా జరిగిన డిజిటల్ అరెస్ట్లను పరిశీలిస్తే ఎంత పెద్ద సంఖ్యలో మోసపోతున్నారన్న విషయం అర్థమవుతుంది. 2022లో 39,925 కేసులు నమోదు అయ్యాయి. సైబర్నేరగాళ్లు బాధితుల నుంచి 91.14 కోట్ల రూపాయలు కాజేశారు. 2023లో సుమారు 500 కోట్లు సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు, మొత్తం సైబర్ క్రైమ్ కేసులు 86,420కి పెరిగాయి. 2024లో 1,23,672 కేసులు నమోదు కాగా సుమారు 1,935.51 కోట్ల రూపాయలు నేరగాళ్లు వసూలు చేశారు. ఈ సంఖ్య ప్రతి రోజూ పెరుగుతూనే ఉంది. అసలు డిజిటల్ అరెస్ట్ అన్న పదం, ప్రక్రియ భారత నేరస్మృతి చట్టంలో లేదని చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇది సైబర్నేరగాళ్లకు వరంగా మారింది. దీనితో దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ తరహా సైబర్ నేరాలను లోతుగా దర్యాప్తు చేసేందుకు వివిధ దర్యాప్తు సంస్థల ప్రతినిధులతో కూడిన ఒక ఉన్నత స్థాయి మల్టీ ఏజెన్సీ ప్యానెల్ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టులో ఈ అంశంపై విచారణ జరగడానికి కొన్ని రోజుల ముందే కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీకి స్పెషల్ సెక్రటరీ అధ్యక్షత వహించనున్నారు. ఈ కమిటీలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (NIA), ఢిల్లీ పోలీసు విభాగాలకు చెందిన ఇన్స్పెక్టర్ జనరల్ స్థాయిఅధికారులు సభ్యులుగా ఉంటారు.

వీరితో పాటు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్, విదేశీ వ్యవహారాలు, ఫైనాన్స్, లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖల నుండి జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులు, భారతీయ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(I4C) సభ్యులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ప్రతినిధులు కూడా ఇందులో భాగస్వామ్యం వహిస్తారు. అదేవిధంగా డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరగాళ్లు ఉచ్చు బిగించిన వెంటనే బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ను కూడా ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని కమిటీలు వేసినా అవి నష్టం జరిగిన తరువాతే రంగంలోకి దిగుతాయి. ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా చూసుకోవడమే ఉత్తమం.తప్పు చేసి పోలీసుల చుట్టూ తిరిగి న్యాయం చేయాలని కోరడం కంటే ఇలాంటి డిజిటల్ అరెస్ట్లు అనే ప్రక్రియ దేశంలో అమలులేదన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలి.

– డాక్టర్ గిరీష్కుమార్ సంఘీ

## కవర్ స్టోరీ

**వాసం నాగరాజు,** ములుగు



**చరిత్రకు మూలవాసులైన ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను, ఆచారాలను, కట్టుబాట్లను గౌరవిస్తూ మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయ పునరుద్ధరణకి, శాశ్వత అభివృద్ధికి ముందడుగు వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రలోనే నిలిచిపోనున్నది. ఆదివాసీల సంస్కృతిని, సాంప్రదాయాలను ప్రపంచానికి తెలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుంది.**

# వన దేవతల జనజాతర

ఈ క్రమంలో జనవరి 28 నుండి 31 వరకు జరిగే దక్షిణ భారత కుంభమేళ మేడారం జాతర పుట్టుపూర్వోత్తరాల చరిత్రని ఒకసారి తిరగవేద్దాం.

## చరిత్ర పుటల్లో మేడారం

మేడారం జాతర మూలాలు సుమారు క్రీ.శ.1260 నుంచి 1320 మధ్య కాలంలో ఓరుగల్లును పాలించిన కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి కాలానికి చెందినవిగా భావిస్తారు. అప్పట్లో మేడారం ప్రాంతం కోయ గిరిజన రాజ్యంగా ఉండేది. కాకతీయులకు సామంతులుగా వ్యవహరిస్తూ, స్వయం పాలన కొనసాగించిన గిరిజన రాజులు అక్కడి ప్రజల జీవన విధానాన్ని రక్షించేవారు.

మేడారం ప్రాంతాన్ని పాలించిన పగిడిద్ద రాజు, కరీంనగరాన్ని పాలించిన మేడరాజుకు మేనల్లుడు. మేడరాజు కుమార్తె సమ్మక్కను పగిడిద్ద రాజు వివాహం చేసుకున్నాడు. పగిడిద్దరాజు సమ్మక్కకు కలిగిన సంతానమే సారలమ్మ, నాగులమ్మ అనే కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు జన్మించారు.

కాలచక్రంలో ఒక దశలో మేడారం ప్రాంతంలో మూడు నుంచి నాలుగు సంవత్సరాల పాటు తీవ్రమైన వర్షాభావం వల్ల తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. పంటలు పండక మేడారం స్థానిక ప్రజలు తిండి కోసం, నీటి కోసం అల్లాడిపోయారు. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో కూడా కాకతీయ రాజ్య పాలకులు కప్పం చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకున్న పగిడిద్ద రాజు, కప్పం కట్టలేనని ప్రతాపరుద్రుడికి స్పష్టం చేశాడు.

ఇది రాజద్రోహంగా భావించిన ప్రతాపరుద్రుడు కోపంతో కాకతీయ సైన్యాన్ని మేడారం మీదికి పంపించాడు. ములుగు సమీపంలోని లక్నవరం సరస్సు వద్ద సైన్యం స్థావరం ఏర్పాటు చేసి, కాకతీయుల సైన్యం మేడారంపై యుద్ధానికి సిద్ధమైంది.

అనావృష్టి, అణచివేత యుద్ధానికి దారితీసింది. మేడారం సరిహద్దులోని సంపెంగవాగు వద్ద పగిడిద్ద రాజు, అతని కుమార్తెలు సారలమ్మ, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు కలిసి కాకతీయ సైన్యాన్ని అడ్డుకున్నారు. ఆయుధాలు తక్కువైనా, ఆత్మవిశ్వాసం, ధైర్యం అపారం. గిరిజనుల స్వేచ్ఛ కోసం జరిగిన ఆ యుద్ధంలో వారు వీరమరణం పొందారు. ఈ వార్త విన్న కుమారుడు జంపన్న తండ్రి, అక్కల మరణాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ప్రాణత్యాగం చేశాడు. అప్పటి నుంచి ఆ సంపెంగ వాగు 'జంపన్న వాగు'గా ప్రసిద్ధి చెందింది.

## యుద్ధరంగంలోకి సమ్మక్క

కాకతీయులతో జరిగిన యుద్ధంలో సమ్మక్క అజేయమైన ఒక శక్తిగా యుద్ధరంగంలోకి దిగింది. కాకతీయ సైన్యంపై విరుచుకుపడింది. సమ్మక్క వీరత్వాన్ని చూసి కాకతీయ సైన్యం భయకంపితమైంది. యుద్ధ అనంతరం మేడారంకి ఈశాన్యంలో ఉన్న చిలకలగుట్టలోకి వెళ్ళి

అదృశ్యమయ్యిందని, ఆ తర్వాత స్థానిక ఆదివాసీల కలలోకి వచ్చి తాను చిలకలగట్టపై కుంకుమ భరిణి రూపంలో ఉన్నట్టు తెలిపిందని భక్తుల విశ్వాసం.

ఈ సంఘటనల అనంతరం తన చేసిన తప్పును గ్రహించిన ప్రతాపరుద్రుడు సమ్మక్క భక్తుడిగా మారినట్లు కథనాలు చెబుతున్నాయి. గిరిజనులు సమ్మక్క, సారలమ్మలను తమ రక్షక దేవతలుగా భావిస్తూ అప్పటి నుంచి పూజించడం ప్రారంభించారు. వీర వనితల ఆత్మగౌరవ పోరాట త్యాగ గాథనే నేటి మేడారం జాతర. కాలగమనములో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కుంభమేళగా వాసికెక్కింది.

## ఆసియా ఖండంలో అతిపెద్ద గిరిజన జాతర

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం జాతర నాలుగు రోజుల పాటు భక్త జనసంద్రంగా తలపిస్తుంది. కుంభమేళా తరువాత దేశంలో అత్యధికంగా భక్తులు పాల్గొనే ఉత్సవంగా మేడారం గుర్తింపు పొందింది. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు కాలినడకన, పూనకాలతో, భక్తి పారవశ్యంతో మేడారానికి చేరుకుంటారు. అడవి దారులు, వాగులు, కొండలు అన్నీ భక్తిపారవశ్యంలో కలిసిపోతాయి. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, కేవలం ఒక ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాదు. అది కోయ, ఆదివాసుల చరిత్ర, వారి స్వాభిమాన పోరాటం, త్యాగానికి నిలువెత్తు సాక్ష్యం. వందల ఏళ్ల క్రితం జరిగిన ఒక వీరోచిత సంగ్రామం, నేటికీ కోట్లాది మందిని మేడారం వనాల వైపు నడిపిస్తున్న అద్భుత గాథగా నిలిచింది.



పూర్వం నుండి ఆదివాసీలు స్థానికంగా జరుపుకుంటున్న ఈ జాతర నేడు ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీల జాతరగా ఖ్యాతిగాంచింది.

## 1996వ సంవత్సరంలో ఎండోమెంట్ ఆధీనంలోకి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1996 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మేడారం సమ్మక్క సారలమ్మ అభివృద్ధికి నిధుల కేటాయించడం జరిగింది. అప్పటినుండి నేటి వరకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహా జాతరకు, జాతర అభివృద్ధి అంచనాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరుగుతోంది.

తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పడిన తర్వాత 2015వ సంవత్సరం 2023 వరకు జరిగిన పెద్ద జాతర, జాతరలకు కలిపి 8 సంవత్సరాల కాలంలో సుమారు 423 కోట్ల రూపాయల నిధులు వెచ్చించారు.

## నాగరికత నేర్పిన ఘనత ఆదివాసులదే!

వాస్తవంగా సమ్మక్క సారలమ్మల చరిత్ర అంటే ఆధునిక చరిత్రగా అందరు భావిస్తారు. తాళపత్ర గ్రంథాల ఆధారంగా అఖండ భారతదేశ చరిత్ర అఖండ భారత దేశంలో 101 రాజ్యాలను పరిపాలన చేసినట్టు పరిశోధనలో వెల్లడైంది. ఇదే సమ్మక్క తల్లి గద్దెలపై ప్రతి మాఘపున్నమి డోలువారు రేల పాటల రూపంలో ఓ రేల.. రేల.. రేల.. జల రేల..రేల..అంటూ 18 దిక్కుల ఆదిశక్తి నీకు పాద పాదాన శరణులు అంటూ దక్షిణ దిక్కున బేరంబోయిన రాజు 18 రాజ్యాలు తూర్పు దిక్కున రాయి బండాని రాజు 23 రాజ్యాలు పశ్చిమాన సనపగాని రాజు 24 రాజ్యాలు ఉత్తరాన కాటురయ్య 36 రాజ్యాలు అని పాడుతారు. మౌఖిక సాహిత్యాలన్నీ పూర్వ చరిత్ర ఆనవాళ్లు. ఈ పాటలు విన్నప్పుడు పూర్వ భారతదేశము అనేది కోయరాజులు పరిపాలించిన చరిత్రగా అర్థమవుతుంది. ఆదివాసులంటే గోసిగుడ్డలు కట్టుకునేవారు, అనాగరికులు, షెడ్యూల్ కులాల కంటే తక్కువ అని ముద్ర వేసిన ఈ సమాజంలో ఈ దేశానికి నాగరికత నేర్పిన ఆదివాసుల



చరిత్రను బయటకి తీసి నిలబెట్టాలనే ఆదివాసి పరిశోధకుల లక్ష్యం అయింది. కోయ సమాజంలో 3 నుండి 7 గొట్ల వంశ వృక్షాలు ఉంటాయి. ఆదిమానవుల జీవనంలో నైతిక విలువలు, శారీరక సంబంధాలు మానవ నాగరికత వైపు అడుగులు వేయాలంటే తల్లి, చెల్లి, అన్న-తమ్ముళ్ళు, తల్లి తండ్రులకు మధ్య కుటుంబ బాంధవ్యాలు ఏర్పడాలి అనుకుంటున్న క్రమంలో వచ్చిన తొలి మార్పు గొట్టు గోత్రాల వ్యవస్థ. అక్క బేరంబోయిన రాజు అనే వ్యక్తి తనకున్న 6 గురు బిడ్డలను వివిధ వంశాల వారికి ఇచ్చుకుంటూ గొట్టు గోత్రాలు ఏర్పాటు చేశాడు. తాను ముందుగా 6వ గొట్టు తీసుకుని మొదటి గొట్టు స్త్రీ అందరూపం ఆది శక్తికి ఇచ్చి రెండవ గొట్టు సూర్య చంద్రులకు ఇచ్చి తన మొదటి బిడ్డను ఇచ్చిన గొట్టు మూడవ గొట్టు రెండవ బిడ్డను ఇచ్చిన గొట్టు నాల్గవ గొట్టు తర్వాత ముగ్గురు బిడ్డలను ఇచ్చిన గొట్టు 5వ గొట్టు చివరి బిడ్డ ఇచ్చిన గొట్టు 7వ గొట్టు అని అందరూ బిడ్డలను ఇచ్చుకుంటూ గొట్టు గోత్రాలు తయారు చేసి ప్రతి గొట్టు వారి చెట్లు జంతువులు, పక్షులను దైవాలు ఇస్తాడు. అలా ఆదివాసుల ప్రకృతి దైవాలను కొలుస్తారు. ఆ వంశ మూలాలు ప్రకృతి దైవాలను ఈ బొమ్మలపై తీసుకోవడం జరిగింది.

## బేరం బోయిన రాజు కోయ సమాజంలో గొట్టు గోత్రాల ఏర్పాటు-ఒక పరిశీలన

ఈ సృష్టికి మూలం మానవ సంబంధాలు. ఆ సంబంధాలు ప్రాచీన యుగం మధ్య శిలాయుగం దశల్లో విచ్చల విడిగా ఉండేవి. శారీరక సంబంధాలలో కూడ కొన్ని నియమాలు ఉండాలి. ఆ సంబంధాలు నైతిక విలువతో ఉండాలి. అంటే ఒక వంశ వృక్ష నిర్ధారణ అవసరం. ఆ క్రమంలోనే పూర్వం గొట్టు గోత్రాల వ్యవస్థ ఎలా ఏర్పాటు అయింది. 'గట్టు' అర్థం ఒకే రక్త సంబంధీకుల మధ్య వియ్యం అనేది నిషేధం. కారణం.. వారు ఒకే తల్లి బిడ్డలు కాబట్టి గట్టు (నియమం) పెట్టుకున్నారు. అలా గుంపులు గుంపులుగా ఉన్న ఆదిమ సమూహాలను ఒక దగ్గర చేర్చి మొట్ట మొదటిసారి బేరంబోయిన రాజు కోయ సమాజంలో గొట్లు ఏర్పాటు చేశారు. గొట్టు గోత్రాలు వ్యవస్థ అర్థం అయితే తప్ప ఈ దేశ వాస్తవ చరిత్ర సింధు నాగరికత చరిత్ర కాదు. ఈ దేశంలో ఉన్న రాతి చిత్రాల లిపి చరిత్ర అసలు ఒక్క మాటలో చెప్పాలి అంటే ఈ దేశ ప్రాచీన చరిత్ర పూర్తిగా చదవటం సాధ్యం కాదు. దేశంలో ప్రతి చారిత్రక కట్టడంలో ఉన్న లిపి కోయ సమాజంలో ఉన్న గొట్టు గోత్రాల వ్యవస్థతో ముడి పడి ఉంది. ఎందుకంటే ఈ దేశ నిర్మాతలు కోయలు






కాబట్టి ఈ దేశాన్ని పరిపాలన చేసినవారు కోయ రాజులు కనుక. ఈ ప్రపంచంలో ఈజిప్ట్ మెసపటోమియ తరువాత ఈ భూమండలంపై భారత ఉప ఖండంలో ఉన్న నాగరికత సింధు నాగరికత, ఆ గొప్ప నాగరికత నిర్మాతలు కూడ కోయ జాతి ప్రజలు సింధు లిపిని చదవాలి. అంటే కోయ డోలి మౌఖిక సాహిత్యం పురాణ గాథలు సంపూర్ణంగా అర్థం అవ్వాలి. అవి అర్థం కాలేదు కాబట్టి నేటికీ 100 సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్త బాషా, పురావస్తు శాస్త్రవేత్తలు ప్రయత్నం చేసిన ఒక్క బొమ్మనీ కూఆ డి కోడ్ చేయలేకపోయారు. ఈ క్రమంలో ఈ లిపి చదవాలి అంటే దాలుగుడ్డలోని చిత్రలిపిని అర్థం చేసుకోవాలి. అప్పుడే సింధు లిపి అర్థం అవుతుంది అందులో ప్రధానంగా 6వ గొట్టు బేరంబోయన వంశం ఆదిమ సమాజంలో అనాగరికమైన విధానాలు ఉన్నపుడు, వరుస, వావి క్రమం లేనినాడు వరుస వావి క్రమం ఉంటే బాగుంటుంది అని నైతిక విలువల సమాజ ఏర్పాటు కోసం ఆనాడు బేరంబోయిన రాజు ఏర్పాటు చేసినటువంటి ఒక ప్రత్యేకమైన విధి విధానమే గొట్టు గోత్రాల వ్యవస్థ.

బేరంబోయిన గోత్రాన్ని 6వ గొట్టు గోత్రం అని కూడ పిలుస్తారు. కోయ సమాజ దిశ నిర్దేశకుడు కాబట్టే ఈ రాజు పెద్ద రాజుగా ఏనుగుపై కూర్చొని ఉంటాడు. బేరంబోయిన రాజు భార్య వరందేవి ఈమె వంశం మూడవ గొట్టు కాకెటి పూజారి గోత్రం వీరిది దక్షిణ ప్రాంతం.





బేరంబోయిన రాజు వరందేవికి సంతానం 6 గురు కొడుకులు, 6 గురు కూతుర్లు. తనకు 6 గురు బిడ్డలు ఉన్నందుకు ముందుగా 6 గొట్టునీ తీసుకున్నాడు.

ఈ బేరంబోయిన రాజు తన బిడ్డలను ఇచ్చి గొట్లు తయారు చేసిన విధానం అర్థం అవటం అతి ముఖ్యమైన అంశం 6 గురు కొడుకులు.

## 6 గురు కొడుకులు

1. పెద మ(రికొమరం పెదరాము; 2. మడి మ(రిమొసం చిన రాము; 3. నడి మ(రి చౌలం ఈదెల్ పూరిల్; 4. సర్వ సిద్ధి ఎట్టి మైసయ్య; 5. జల్లి గండ కారం దారెల్ రాజు; 6. అడ్డ దిడ్డ పొడెం బంగారం పాపల.

## 6 గురు కూతుళ్లు

1. మొదటి కూతురు చింగలదర్మం; 2. రెండవ కూతురు మాందేవి; 3. మూడవ కూతురు తూల్ ముత్తి; 4. నాలుగవ కూతురు దేవ చం(ద్రావతి; 5. ఐదవ కూతురు దేవ కనకావతి; 6. ఆరవ కూతురు భైరందేవి.

## ఆరవ గొట్టు ఏర్పాటు

బెరంబోయిన రాజు వరందేవి వారికి కలిగిన 6 గురు కూతుళ్లను మిగత కోయ వంశంలోని కొంత మంది వేరే వంశ వ్యవస్థనీ తీసుకొని, వారికి బిడ్డలను ఇచ్చుకుంటు గొట్ల వ్యవస్థ ఏర్పాటు చేశారు. తన ఆరుగురు బిడ్డలను కన్యాదానం చేస్తూ గొట్లు తయారు చేశాడు కాబట్టి మొదటగా తాను ఆరవ గొట్టు తీసుకున్నాడు. వీరివి దక్షిణ (ప్రాంతంలో 18 రాజ్యాలు.

**ఒకటవ గొట్టు:** మొదటి గొట్టు (స్త్రీ అండ రూపంకి ఇచ్చి మానవ ఉత్పత్తికి మూలం కనుక ఆదిశక్తిగా దైవంగా కొలవాలి అని సూచించాడు.

**రెండవ గొట్టు:** రెండవ గొట్టు సూర్య చం(ద్రులు (ప్రకృతికి ఇచ్చాడు. సృష్టికి మూలం కాబట్టి శా(స్త్రీయంగా (ప్రకృతిని దైవం అన్నాడు.

**మూడవ గొట్టు:** మొదటి కూతురు 'చింగల దర్మం ఇర్మ రాజు(తార మచ్చుడు)'కి ఇచ్చి పెళ్లి చేసారు. ఆ విధంగా మూడవ గట్టు గో(త్రం ఏర్పాటు చేశాడు. వీరికి ఉత్తర (ప్రాంతంలో 36 రాజ్యాలు ఇచ్చాడు.

**నాల్గవ గొట్టు:** రెండవ కూతురు మాందేవిని జలా చం(ద్రుడు సనప వంశం పారేడు గట్టు శాఖన పడమటి దేశం పరందారు పట్నాన్ని ఏలే రాజుకి ఇచ్చి చేసారు. ఆ విధంగా వియ్యం ఏర్పడింది, 4వ గొట్టు ఏర్పడింది. వీరికి పడమటి (ప్రాంతంలో 24 రాజ్యాలు ఇచ్చాడు.

**అయిదవ గొట్టు:** మూడవ కూతురు 'తూల్ ముత్తిని తూర్పు దేశం పులితల వాయిల్ గుండం పట్నాన్ని ఏలే రాజు ఉయిక సాంబశివ మహారాజుకి' ఇచ్చి వివాహం చేశారు. ఆ విధంగా 5వ గొట్టు ఏర్పడింది. వీరికి తూర్పు (ప్రాంతంలో 26 రాజ్యాలు ఇచ్చాడు.

నాలుగవ కూతురు, ఐదవ కూతురు ఇద్దరినీ అంటే దేవచం(ద్రావతి, దేవకనకావతి ఇద్దరినీ కూడ అదే రాయి బండాని వంశంలో 5వ గొట్టు మేడరాజుకి ఇచ్చి వివాహం చేయడం జరిగింది. ఏడవ గొట్టు ఆరవ కూతురైన భైరందేవిని బార గుజ్జుడికి ఇచ్చి వివాహం చేయడం జరిగింది.

ఆ విధంగా పారేడు గట్టు గో(త్రం వారికి బెరంబోయిన గో(త్రం వారికి సంబంధం బాంధవ్యాలు ఏర్పడ్డాయి. ఇలా **7వ గొట్టు** ఏర్పడింది. వీరు పశ్చిమ (ప్రాంతం రాజ్యాలలో భాగం.

## గత చరి(త్రకు సజీవ సాక్షాలుగా మేడారం

మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు గొట్లకు సంబంధించిన కోయల రాజరిక చరి(త్ర ఆదివాసుల ఇలవేల్పులది. దైవాల డాలుగుడ్డలపై చి(త్రలిపిలో బొమ్మలు ఉండటం దేశంలో 1000కి పైగా కోయ మూలలపై ఆదివాసి విద్యార్థులు క్షే(త్ర స్థాయి పరిశోధనలు చేశారు.

ఆ అనుభవం కామారం బిర్సా ముండా పరిశోధక అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ జిల్లా బృందానికి ఉండటం ఆలయ డిజైన్ అతి తక్కువ కాలంలో సాధ్యమైంది. గద్దెల చుట్టూ మొదటగా 1000 అడుగుల చతుర(స ఆకారంలో గద్దెల విస్తీర్ణం పెంచుతూ ఒక ద్వారానికి అనుసంధానంగా రాతితో చేసిన 8 ద్వారాలను నిర్మించారు.

అందులో తూర్పు ఈశాన్యంలో సమ్మక్క తల్లి ప్రధాన ద్వారం, పక్కన పూజారులు సిద్ధబోయిన, కోకేర వారి ద్వారం, పగిడిద్దరాజు, గోవిందరాజు, సారలమ్మ ద్వారం.. ఇలా ఎవరి ప్రత్యేకతను వారికి ఇస్తూ నిర్మాణం చేశారు. ఇందులో ఈ వంశాల పూర్వ చిత్రలిపి బొమ్మల నిర్మాణం చేశారు. సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజు గద్దెలపై ఒక గద్దెకు 8 పిల్లర్‌ల చొప్పున అందులో ఒక పిల్లర్‌కి 28 బొమ్మల చొప్పున 32 పిల్లర్లను తీసుకొని వాటిపై 947 పూర్వ బొమ్మలు, వారి వంశవృక్షాలు చెట్లు పక్షులు జంతువుల చిత్రలిపిని నిర్మించారు.

గుడి ప్రాంగణంలోని నాగులమ్మ, వనం పోతురాజు గుడి నిర్మాణం కూడా చేపట్టి వారి వంశ మూలాలను అందులో తీసుకోవడం జరిగింది.

గుడి చుట్టూ ప్రహరీ నిర్మాణంలో 90 ప్యానెల్స్ తీసుకొని అందులో 45 ప్యానల్‌ను వెదురు బొంగును పోలిన విధంగా బయట నుండి లోపలికి కనపడే విధంగా గాలి ఆడే విధంగా తీసుకొని 45 పానల్స్ పై లోన వైపున కోయల గొట్టు గోత్రాలు, ఇలవేల్పుల బొమ్మలు, దైవాలు కోయల పవిత్ర చరిత్ర తెలిపే చిత్రలిపిని తీసుకోవడం జరిగింది. బయటి వైపు కోయల ప్రకృతి జ్ఞానాన్ని చెట్లు, పక్షులు, జంతువుల అరుపులను బట్టి వాతావరణ అంచనా, చందమామ, సూర్యుడు నెలవంకని బట్టి కాలం అంచనా, ఔషధ మొక్కల వైద్యం ఇండిజినస్ జ్ఞానంతో వ్యవసాయ విధానం, ఆదిమానవుడు బట్టలు ధరించని కాలంలో కోస కాయ నుండి దూది తీసి దానిని కుండలో వేసి కాగబెట్టి బట్టలు తయారు చేసి ఈ సమాజానికి బట్టలు అందించిన సందర్భం నిప్పుకణిక ముఖరాయితో తయారుచేసి నిప్పును కనుగొన్న సందర్భం, దుస వడ్ల నుండి వరి వంగడం తయారు చేసి వ్యవసాయ విధానం సందర్భం.. ఇలా అనేక అంశాలను వేయటం జరిగింది. మొత్తంగా 7 వేల బొమ్మలతో ఆదిమ చిత్రాలు లిపితో నిర్మాణం జరిగింది. ఇందులో చెక్కించిన ప్రతి బొమ్మకు ఒక శాస్త్రీయ అర్థం ఉన్నది. ఒక ఆధారంతోనే లిఖించడం జరిగింది.

## మేడారంలో శాశ్వత అభివృద్ధి

2023 డిసెంబర్ నెలలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 2024 ఫిబ్రవరి నెలలో జరిగిన మహా జాతరకు 110 కోట్ల రూపాయలు నిధులు కేటాయించింది. 2026 మేడారం జాతరకి శాశ్వత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 251 కోట్ల రూపాయలతో ఆదివాసి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా గద్దెల విస్తీర్ణ, ఆలయం చుట్టూ రాతి స్తంభాలతో నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక పూజారులు, ఆదివాసి పెద్దల సలహాలు సూచనలతో మేడారంలో మరో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల విస్తీర్ణం చేపడుతూ, ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే గొట్టు గోత్రాలకు సంబంధించిన సుమారు 7 వేల చిత్రాలకి ఆళ్లగడ్డ శిల్పులు ప్రాణం పోశారు. ఆదివాసులకు విశ్వాసాలు గౌరవించడం రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా దానిలో రాయిబండారి వంశం సమ్మక్క తల్లి వంశంలో పుట్టిన వారి ఆడబిడ్డ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపటం ఆదివాసీలు కూడ ప్రభుత్వాన్ని విశ్వసించటంతో సమ్మక్క గద్దెలను ముట్టుకొని మార్పు చేసే సాహసం చేశారు కోయ పూజారులు.



## సమ్మక్క సారక్క తల్లుల ఆగమనం

మేడారం జాతర భక్త జనసంద్రంతో నిండిపోనుంది. ఈ సంవత్సరం సమ్మక్క సారక్క తల్లుల దర్శనం కోసం భక్తుల సంఖ్య రెండు కోట్లకి పెరిగే అవకాశం వుంది. మేడారం కొత్త పుంతలు తొక్కుతూ ఇలవేల్పుల బొమ్మలతో కొత్త రూపం సంతరించుకుంది.

మేడారం జాతర తేదీలు ప్రధాన పూజారులు నిర్ణయించడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటంతో ముందస్తుగానే మేడారం జాతర మొదలయింది. సారలమ్మను కాక వంశీయులు పూజరులుగా వ్యవహరిస్తారు. జనవరి 28 కన్నెపెల్లి నుండి కాక వంశీయులు పూజరుల ద్వారా మేడారం గద్దెలపై సారలక్క ఆగమనం జరుగుతుంది. సమ్మక్క తల్లిని సిద్ధబోయిన వంశీయులు ప్రధాన పూజరులుగా వ్యవహరిస్తారు. జనవరి 29న చిలకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని ఆచారాలు. సంప్రదయాలు, డోలు వాయిద్యాలతో ప్రధాన పూజారులు ఆగమనం చేయిస్తారు. సమ్మక్క సారక్క తల్లుల ఆగమనం మొదలుకొని జనవరి 30 వరకు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. ఆ రోజు నుండి మేడారం జాతర భక్తుల కోలాహలంగా ఉంటుంది. భక్తుల మొక్కుల తర్వాత జనవరి 31న సమ్మక్క సారక్క తల్లులు తిరిగి వనంలోకి ప్రవేశం ఉంటుంది. ఆ తల్లుల గద్దెల ఆగమనం నుండి మళ్లీ రెండేళ్ల వరకు భక్తులు మొక్కులు చెల్లిస్తూనే ఉంటారు.

# పచ్చటి ఊపిరి!

ఆకుపచ్చ రంగుడబ్బా
ఒలికిపోయిందో ఏమో
అక్కడ పచ్చ ప్రపంచం వెలసింది..
నేలను సూర్యచంద్రులు
తాకలేనంతగా
వృక్షరాజాలు ఆకాశాన్నంటి
ప్రపంచమంతా
చూస్తున్నాయ్
చల్లటి మలయ మారుతం
నేరుగా హృదయాన్ని
తాకుతుంది.
నిశ్శబ్ద సౌందర్యం అదేపనిగా
మాట్లాడుతుంది.
అక్కడ..
క్రూరమృగాలు కూడా ఉంటాయి
కానీ క్రూరత్వం ఉండదు!
ఇవ్వడం ఉంటుంది..
తీసుకోవడం ఉండదు
మూగజీవులు మౌనం పాటిస్తే
సెలయేళ్ళు గలగలా మాట్లాడతాయి
ఔషధ వృక్షాలు
ఆయుష్షు పోసే క్రతువులో
అపర ధన్వంతరులై సేవ చేస్తాయి
పర్యావరణం అక్కడ పట్టం కట్టుకొని
ప్రతిష్టాపన పొందింది.
నరదృష్టి ఎలా సోకిందో
పచ్చకోట ప్రమాదంలో పడింది?
గొడ్డలి భుజాన్నేసుకుని
మనిషి అడుగు మోపాడు..!
తపస్సమాధిలో ఉన్న
ఎత్తైయిన ఋషిపుంగవులు
ఉలిక్కి పడ్డారు
గొడ్డలి వేటుకి
నిట్టనిలువునా కూలిపడ్డారు.
పక్షులు శాపనార్థాలు పెడుతూ



గాల్లో చక్కర్లు కొడుతున్నాయ్
పచ్చదనానికి పాడె కడుతుంటే
పురుగూ పుట్రా కన్నీళ్ళతో
సాగనంపుతున్నాయ్
పచ్చకోట కూలిపోయింది.
మాయలఫకీరు ప్రాణం
చిలకలో ఉన్నట్లు
నశించిపోతున్నా నరుడి ప్రాణాలు
తన గుండెల్లోనే భద్రంగా
దాచుకొంది పచ్చదనం!

– భీమవరపు పురుషోత్తమ్

## ఈవారం కవిత్వం

# జ్ఞాపకాల జడి



సఖీ!
నీవు నా స్వప్నలోకపు రాజ్ఞివి
కావడంతో ఒక్క ఉదుటున
మెలకువ వచ్చింది.
కిటికీలోంచి బయటకు చూస్తే
శారదాకాశంలో
తేలియాడుతోన్న తెలిమబ్బులు,
కర్పూరపుపొడిలా కురుస్తోన్న
వెన్నెలసోనల జడి.
ఇంతలో... హాల్లోని గోడగడియారం
రెండు గంటలు కొట్టిన చప్పుడు.
నా మనసిప్పుడు...
నీ జ్ఞాపకాల గడియారంలోని
లోలకమైంది.
నిశ్చలంగా నిలిచేలా లేదది,
నీ స్మృతుల్లో మునిగి తేలేదాకా.
ప్రియా! నీవే నేనైన ఆ రోజుల్లో ...
నీ సమక్షం
వేసవి సందెవేళ
వికసించిన మల్లెల సౌరభాన్ని
మోసుకుపోయే చల్లగాలిలా,
శరత్కాలంలో
పూల పరాగంతో వెలిగిపోతున్న
నింగిలా, మరువపు
సుగంధంలా ఉండేది.
సుహాసినీ! నీ సాంగత్యంతో
పెల్లుబికిన కవితావేశంతో,
మదిలోని భావసౌగంధికలను
గుదిగుచ్చి నీపై నేనల్లిన
ప్రేమ కవితలెన్నో!
రసరమ్యమైన
వాటినాస్వాదించడానికి,
చకోరాలు సైతం
వెన్నెల్లో విహరించిన మధురక్షణాలు
నీకూ గుర్తుండే ఉంటాయి.
ఓ ప్రియతమా! నీతో ముడిపడి
ఇంపుగా మలచబడి,
ఎంతో ఆనందానిచ్చిన ఈ వేళలో
పక్కపిలుస్తోంది ఎక్కడికి
పోయావంటూ,
రా రమ్మంటూ..

– వేమూరి శ్రీనివాస్

# "అలల ఎదురుచూపు"

సముద్రపు అలల అంచున
నీ కోసం నిలుచున్నాను
నువ్వొస్తావనీ కబురంపినట్టే ఈ అలలు,
నా పాదాలని అతి సుకుమారంగా,
నిన్ను తొలిసారిగా తడిమిన తీరుగానే
ఎడతెరిపి లేకుండా స్పృశిస్తున్నాయి.
పాదాల కింది ఇసుకని
చెల్లాచెదురు చేసి తిరిగెళుతున్నాయి
పట్టరాని ఆనందాన్ని పట్టుకుని వెళుతున్నట్టే.
ఉత్సాహాన్ని ఇంతకింతకు పెంచుకుంటూనే
ఆనందపు డోలికల్లో ఆడుకుంటున్నాయి
తల్లి ఒడిలోకి చేరిన పసిపాప నవ్వల్లే.
నువ్వొచ్చాక వాటి పని పూర్తయినట్టుగానే,
మెల్లగా నిశ్శబ్దంలోకి జారుకున్నాయి.

– బాలాజీ పోతుల

సింగిల్ పేజీ కథ

# నిశ్శబ్దం గెలిచింది!

కిటికీ గుండా జారుతున్న పలచని వెలుతురు ఆ పాత వెండి పెన్నుపై పడింది. ఒకప్పుడు అది రఘురామ్‌కు గర్వకారణం. ఒక సాహిత్య సంస్థ పదేళ్ల క్రితం ఆయన ప్రతిభను గుర్తించి ఇచ్చిన గౌరవం. కానీ ఇప్పుడు అతడి వేళ్ల మధ్య ఆ పెన్ను ఒక భారమైన ఇనుప ముక్కలా అనిపిస్తోంది.

అతడు నెమ్మదిగా డైరీ తెరిచాడు. తెల్లటి పేజీలు అతడిని వెక్కిరిస్తున్నట్టున్నాయి. రెండు అక్షరాలు రాయబోయాడు... పెన్ను మొరాయించింది. లోపల సిరా ఎండిపోయిందో, లేక తనలోని భావాలే ఆవిరైపోయాయో అతడికి అర్థం కాలేదు.

“ఇంకా ఆ పాత సామాన్లతో ఏం పని? ఆఫీసుకి టైమ్ అవుతోంది. కనీసం అబ్బాయి చదువైనా చూసుకోండి!”

హాల్ నుంచి భార్య శారద గొంతు విసుగ్గా వినిపించింది. రఘురామ్ నిశ్శబ్దంగా డైరీ మూసేశాడు. అతడి లోపల ఒక రచయిత దశాబ్దాలుగా నిద్రపోతున్నాడు. కాదు... బాధ్యతల పేరుతో, జీవన పోరాటంలో అతడు బలవంతంగా నిద్రపుచ్చబడ్డాడు.



మధ్యాహ్నం... కాలేజీ ప్రిన్సిపాల్ గదిలో శారద ఆవేశంగా మాట్లాడుతోంది. “చూడండి సార్... ఇంటర్‌లో ఇన్ని సబ్జెక్టులు పోతే మా అబ్బాయి భవిష్యత్తు ఏంటి? ఇంట్లో వాళ్ల నాన్న గారు ఎప్పుడూ ఏదో లోకంతో సంబంధం లేనట్టే ఉంటారు. పిల్లవాడిని గమనించాల్సింది మీరే కదా!”

ప్రిన్సిపాల్ ప్రకాష్ గారు నిమ్మళంగా అప్లికేషన్ ఫామ్ చూస్తున్నారు. తండ్రి పేరు దగ్గర ‘రఘురామ్’ అని చూడగానే ఆయన కళ్లలో ఒక మెరుపు మెరిసింది.

“ఒక్క నిమిషం అమ్మా. మీ భర్త గారేనా ఈ రఘురామ్? ‘మౌనపు పయనం’ రాసిన రచయిత?”

శారద ఒక్కసారిగా ఆగింది. “ఆయన... పుస్తకాలతో కాలక్షేపం చేస్తారని తెలుసు కానీ... ఇంత గొప్ప రచయిత అని నాకు తెలియదండీ...” అంది నసుగుతూ.

ప్రిన్సిపాల్ గారు లేచి పక్కనే ఉన్న షెల్ఫ్ దగ్గరకు వెళ్లి ఒక పాత పుస్తకం తీశారు. “పదేళ్ల కిందట ఈ కథ చదివి నేను కన్నీళ్లు పెట్టుకున్నాను. మనిషి అంతరంగాన్ని ఇంత లోతుగా తాకే రచయితలు అరుదు. మీ భర్త రాసిన వాక్యాలను మేం ఇప్పటికీ విద్యార్థులకు ఉదాహరణలుగా చెప్పుకుంటాం”.

శారద గొంతులో ఆవేశం ఒక్కసారిగా ఆవిరై మౌనంగా మారిపోయింది.

అంతసేపూ తల దించుకుని నిలబడ్డ కొడుకు కార్తిక్ ... మొదటిసారి తన తండ్రిని ఒక గెలిచిన వీరుడిలా గర్వంగా చూశాడు.

ప్రిన్సిపాల్ మెల్లగా “కొన్ని సార్లు కుటుంబం కూడా తెలియకుండానే ఒక గొప్ప కళను నిశ్శబ్దం చేస్తుంది. కానీ ఆ నిశ్శబ్దం ఎక్కువ కాలం కొనసాగితే నష్టపోయేది కేవలం ఆయన మాత్రమే కాదు. ఈ సమాజం కూడా”

ఆ మాటలు శారద మనసులో గట్టిగా ప్రతిధ్వనించాయి.

ఆ రాత్రి.. ఇంట్లో–

రఘురామ్ కిటికీ పక్కన కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు. శారద నెమ్మదిగా లోపలికి వచ్చింది. ఆమె చేతిలో ప్రిన్సిపాల్ ఇచ్చిన ఆ పాత పుస్తకం ఉంది. “ఇంత కాలం మిమ్మల్ని కేవలం బాధ్యతల మధ్య నలిగిపోయే మనిషిగానే చూశాను. మీ అక్షరాల్లో ఇంత జీవం ఉందని నాకు తెలియలేదు. నన్ను క్షమించండి” ఆమె గొంతులో వణుకు.

కార్తిక్ ముందుకు వచ్చి తండ్రి దగ్గర కూర్చున్నాడు.

“నాన్నా... మీ కథలో ఒక వాక్యం చదివాను... ‘కలలు కనడం మనిషి హక్కు’ అని. అది నాకూ నేర్పండి నాన్నా. మీ కలను మా కోసం వదులుకోకండి”.

రఘురామ్ కళ్లలో నీళ్లు తిరిగాయి. ఏళ్ల తరబడి గడ్డకట్టిన మంచు ఒక్కసారిగా కరిగినట్టైంది. అతడు అల్మారాలో దాచిన వెండి పెన్ను తీశాడు. ఈసారి పెన్ను మొరాయించలేదు. సంవత్సరాల తరబడి మూసుకుపోయిన సిరా పొరలు, తన యజమాని స్పర్శ తగలగానే అక్షరాలై ప్రవహించడానికి సిద్ధమయ్యాయి. శారద పక్కనే కూర్చుని ఆయన రాసే ప్రతి అక్షరాన్ని ఆరాధనగా చూస్తోంది. డైరీ మొదటి పేజీలో అతడు ఇలా రాశాడు.. “మౌనం ఒక శిక్ష కాదు... అది మరో గొప్ప సృజనకు పట్టిన ప్రసవ వేదన!”

ఆ రాత్రి నిశ్శబ్దం గెలిచింది. కానీ అది ఓటమిని ఇచ్చే మౌనం కాదు... అక్షరాలకు ఊపిరిపోసే మౌనం. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ... ఒక రచయిత మళ్లీ పుట్టాడు.

– గగనం శ్రీనుకుమార్

# గణతంత్ర భారతం @77

ఎన్నో కష్టాలు, ఎన్నో కన్నీళ్లు, భరింపశక్యంగాని బాధలతో స్వేచ్ఛ అనే పదానికి అర్థం లేకుండా బానిసత్వపు శృంఖలాల్లో బందీలై, పరాధీనులై, పరాయి మూకల దౌర్జన్యాలను సహించి, భరించి, గుండె నిండా దాగిన బడబాగ్ని అగ్ని పర్వతమై, బద్ధలై సహనం నశించి, మానసిక ఉద్వేగాలు తారాస్థాయికి చేరి లావాలా ప్రవహించిన తరుణంలో ఆంగ్ల వలస పాలకులు బెంబేలెత్తి, పలాయన మంత్రం పఠించిన నేపథ్యంలో ఆంగ్ల పాలకుల దమనకాండతో దినదిన గండంలా మారిన భారతీయుల జీవితాల్లో ఉషః కాంతులు ప్రసరించాయి. అప్పుడే తొలి పొద్దు పొడిచిన అనుభూతి కలిగింది. భారతీయుల పౌరుషాగ్ని జ్వాలలు మిన్నంటి, వలస పాలకుల గుండెల్లో కార్చిచ్చు రగిలింది. సిరులు పొంగిన జీవగడ్డపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది.

స్వేచ్ఛ కోసం, స్వాతంత్రం కోసం, జాతి విముక్తి కోసం శతాబ్దాలు పోరాడిన భారతీయ వీరుల త్యాగాలు శ్వేత జాతీయుల అహంకార మదంపై అంకుశమై, భరతమాత దాస్య శృంఖలాలు తెంచబడ్డాయి.

1947వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీ భారత జాతి చరిత్రలో ఒక మహోన్నత ఘట్టం ఆవిష్కరించబడింది. జన హృదిలో 'స్వేచ్ఛ' సంగీత ఝరిలా ప్రవహించింది. కోట్లాది మంది ప్రజల స్వాతంత్ర్య కాంక్ష నెరవేరింది. జన జీవితాల్లో కొంగొత్త కాంతి ప్రభవించింది. తూర్పున విచ్చుకున్న కాంతులు పశ్చిమ దేశ ఆంగ్ల పాలకులను పడమర దిక్కుకు సాగనంపి అస్తమించేలా చేసాయి. పచ్చిక బయళ్ళు, పంటచేలు తివాచీ పరచి స్వేచ్ఛను స్వాగతిస్తున్న భావన కలిగింది. చల్లని గాలులు పూల పరిమళాలను నలుదిక్కులకు వెదజల్లాయి. లేగ దూడలు చెంగు చెంగున ఎగురుతుంటే తోడేళ్ళ గుంపును చేధించుకుని జింకలు భీతిని విడిచి స్వేచ్ఛగా చరించాయి. పంటచేలు కళకళలాడాయి. గుండెల్లో గూడు కట్టుకుని, ఘనీభవించిన స్వేచ్ఛాకాంక్ష కరిగి ఆనందభాష్పాలై ప్రవహిస్తుంటే, మూసుకున్న కిటికీ తలుపు తెరచి చూస్తే ఇంటి బయట పేర్చిన రాళ్ళ గుట్టలు, చుట్టూ ఉన్న ముళ్ళ పొదలు స్వేచ్ఛను బంధించిన ప్రతిబంధకాల్లా అగుపించాయి. తూటాల చప్పుళ్ళు ఆగిపోయాయి.

దౌర్జన్యాలతో, దమన కాండతో మారణ హోమం సాగించిన క్రూరుల విన్యాసాలు శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాయి.




రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్య వైభవం భారతదేశంలో పేకమేడలా కుప్పకూలి సమాధి కట్టబడింది. అహంకారంతో గర్జించిన గొంతులు దేశ భక్తుల త్యాగాల ముందు మోకరిల్లాయి.

వీరుల రక్తంతో తడిచిన నేల పునీతమై భావితరాలకు సందేశమై నిలిచింది. ఆగష్టు 15 భరతజాతి కీర్తి కిరీటంలో సగర్వంగా ఇమిడి పోయి శాశ్వత యశస్సులా ఆచంద్ర తారార్కమై నిలిచింది. ఎన్నో దౌర్జన్యాలు భరించిన భరతజాతి స్వేచ్ఛా వాయువులు శ్వాసించడానికి ఎంతోమంది వీరులు తమ శ్వాసను త్యజించారు. తమ ఊపిరిని జాతి ఊపిరి కోసం ఉరికంబాలకు బలిచ్చారు.

ఎన్నో ఉద్యమాలు, మరెన్నో త్యాగాల ఫలంగా సిద్ధించిన స్వాతంత్ర్య భారతం స్వీయ పాలనకు ప్రణాళికలు రచించింది. ఎంతో మంది మేధావుల అవిశ్రాంత కృషి ఫలితంగా భారతదేశం 1950వ సంవత్సరం జనవరి 26వ తేదీన సర్వసత్తాక, సామ్యవాద లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించింది. భారతీయులు తమను తాము పరిపాలించుకోలేరన్న ఆంగ్ల దొరల పైత్యం అంతరించింది. 1950 జనవరి 26వ తేదీ భారత దేశ చరిత్రలో మరో నూతన అధ్యాయానికి నాంది పలికింది.

## రాజ్యాంగ రూపకల్పన

సువిశాల దేశాన్ని ఏకతాటిపై నడిపించడానికి, సత్పరిపాలన సాగించడానికి నియమాలు, నిబంధనలు, చట్టాలు అవసరమయ్యాయి. అందుకోసం దేశానికి పటిష్టమైన రాజ్యాంగం అవసరమన్న భావన అంకురించింది. అప్పట్లో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఎం.ఎన్.రాయ్ భారత రాజ్యాంగ రూపకల్పన కోసం రాజ్యాంగ సభ అవసరమని 1934లో ప్రప్రథమంగా ప్రతిపాదన చేసాడు.

రాజ్యాంగ సభ ప్రజాస్వామ్య బద్ధంగా, వయోజన ఓటు హక్కు ద్వారా ఏర్పడాలని 1935వ సంవత్సరంలో నెహ్రూ వాదించాడు. అనేక తర్జనభర్జనలు జరిగిన తర్వాత

ఎలాగూ తాము భారతదేశాన్ని విడిచిపోక తప్పదనే భావనతో బ్రిటీష్ పాలకులు రాజ్యాంగ సభ ఏర్పాటు కోసం 1940 సంవత్సరంలో సూత్రప్రాయంగా అంగీకరించడం జరిగింది. రాజ్యాంగ సభ ఏర్పడిన ప్రారంభంలో 389 సభ్యులుండగా, పాక్ విభజన వలన ఈ సంఖ్య 299కి తగ్గింది. రాజ్యాంగం రూపొందించేటప్పుడు, ఆమోదం పొందేటప్పుడు సభ్యుల మధ్య అనేక సైద్ధాంతిక విభేదాలు తలెత్తడం వలన అనేక పర్యాయాలు విస్తృత మేథోమథనం జరిగింది. కడకు 284 సభ్యుల మెజారిటీ వాదంతో రాజ్యాంగ సభ భారతదేశ లిఖిత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన ఆమోదించగా, భారత రాజ్యాంగం 1950వ సంవత్సరం జనవరి 26వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది.

భారత రాజ్యాంగ రచనలో అనేక మంది ప్రముఖులు కీలక భూమిక పోషించిన విషయాన్ని విస్మరించరాదు. రాజ్యంగ పరిషత్‌కు బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడిగా నియమింపబడగా, డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశేష కృషి చేసారు. రాజ్యంగ శిల్పిగా ఖ్యాతి నొందారు. రాజ్యాంగ రూపకల్పన సమయంలో వివిధ అంశాల విషయంలో సమగ్ర పరిశీలన కోసం, పౌరుల హక్కుల కోసం పలువురు మేధావులతో అనేక కమిటీలను ఏర్పాటు చేసారు. ఒక్కో కమిటీకి ఒక్కో మేధావిని, రాజనీతిజ్ఞుడిని ఆయా కమిటీలకు ఛైర్మన్లుగా ఎంపిక చేయడం జరిగింది. వీరిలో పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, మౌలానా అబుల్ కలామ్ అజాద్, కె.ఎం.మున్షీ, దుర్గాభాయి దేశ్‌ముఖ్ వంటి అనేక మంది ప్రముఖులున్నారు. వీరంతా రాజ్యాంగ రూపకల్పనలో శక్తివంచన లేకుండా, దేశ శ్రేయస్సు కోసం కృషి చేసారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, మహిళల కోసం రాజ్యాంగంలో అనేక అంశాలను పొందుపరచడం జరిగింది.

రాజ్యాంగ రచనలో అనేకమంది మహిళల విశేష కృషి కూడా దోహద పడింది. భారత రాజ్యాంగం అపారమైన మేధాశక్తి, దార్శనికతతో నింపబడింది. జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవంగా ప్రకటించబడింది.

## గణతంత్ర భారత ప్రస్థానం

భిన్న వైరుధ్యాల సువిశాల భారతదేశంలో ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాలన్న అనేక మంది మేధావుల ఆలోచనలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీని ప్రతీ ఏటా భారతీయులంతా 'గణతంత్ర దినోత్సవం'గా ఘనంగా జరుపుకుంటున్నారు. 76 వసంతాలు పూర్తి చేసుకుని, 2026లో 77వ గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న భారతావని ఈ సుదీర్ఘ ప్రస్థానంలో సాధించిందేమిటి? సాధించవలసిన లక్ష్యాలేమిటి? ప్రజలందరి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, పౌర హక్కులు కాపాడబడుతున్నాయా? అందరికీ విద్యా, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయా? ప్రజలందరికీ జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు అందించబడుతున్నాయా? ఆకలి, దరిద్రం, నిరుద్యోగం వంటి సమస్యలకు నిజమైన పరిష్కారం లభించిందా? అనే విషయాలను ఈ సందర్భంలో క్లుప్తంగానైనా ప్రస్తావించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంగ్ల పాలకులు దేశం విడిచి పోతూ భిన్న మతాలు, విభిన్న కులాలు, అనేక సాంస్కృతిక, సైద్ధాంతిక వైరుధ్యాలు గల విశాల భారతదేశంలో నాటిన చీకటి బీజాలు నేటికీ అంకురిస్తూనే ఉన్నాయి. భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆంగ్ల పాలకులు వదిలి వెళ్లిన అవశేష జాడ్యాలు దేశంపై ఈనాటికీ తమ ప్రభావాన్ని చూపుతునే ఉన్నాయి. అయితే భారతీయ యువత నేడు శక్తివంతంగా తయారైనది.

ఆంగ్ల పాలకులు వదిలి వెళ్లిన అవశేష జాడ్యాలు దేశంపై ఈనాటికీ తమ ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. అయితే భారతీయ యువత నేడు శక్తివంతంగా తయారైనది.

ప్రజల ఆలోచనా దృక్పథంలో పెను మార్పులు సంభవించాయి. దేశంలో విద్యావంతుల శాతం పెరిగింది. అయినప్పటికీ ప్రజలు కుల, మతాల కంటే రాజకీయ పరంగా వివిధ వర్గాలుగా విడిపోయారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అధికారం కోసం రాజకీయ పార్టీలు ప్రజలను చీల్చడం, వారి మధ్య సమైక్యతను చెడగొట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో దేశాభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతున్నది. అయితే ఇన్నాళ్ల స్వతంత్ర, గణతంత్ర భారతంలో అభివృద్ధి జరగలేదనడం అవాస్తవం.

అభివృద్ధి అంటే సంపద పెరగడం కాదు. ఆ సంపద దేశ ప్రజలందరికీ చేరిందా? లేక కొద్ది మంది కుబేరుల భోషాణాల్లో కులుకుతుందా? అనే అంశమే ప్రధానం. గతానికి, వర్తమాన దేశ పరిస్థితులకు చాలా వ్యత్యాసమున్న మాట వాస్తవం. భారతదేశంలో ఇంకా పేదరికం తాండవిస్తున్నా, ఇంకా చాలా మంది విద్యా, ఉపాధి అవకాశాలకు దూరంగా ఉన్నా, 77వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన గణతంత్ర భారతదేశంలో అనేక మార్పులు సంభవించాయి.

అప్పటి మాదిరిగా ఇప్పుడు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం తీవ్ర స్థాయిలో లేకపోవడం హర్షదాయకం. విద్యా, ఉపాధి

అవకాశాలు పెరిగాయి. ప్రజలకు పూర్తి స్థాయిలో కాకున్నా, జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు పెరిగాయి. దేశం శాస్త్ర, సాంకేతిక రంగంలో శరవేగంగా దూసుకుపోతున్నది. దేశం ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అమెరికా లాంటి అగ్ర దేశానికి సైతం తలవంచే పరిస్థితులు నేడు లేవు.

144 కోట్ల జనాభా నేడు భారతదేశానికి బలంగా మారింది. భారతీయ యువత దేశాభివృద్ధికి బాసటగా నిలిచింది. భారత సైనిక సామర్థ్యం పెరిగింది. అంతరిక్ష రంగంలో భారతదేశ ఖ్యాతి ఖండాంతరాలకు ఎగబాకింది.




అమెరికా, చైనా, రష్యా లాంటి అగ్ర దేశాలు ప్రపంచాన్ని శాసించడానికి తమ శక్తి సామర్థ్యాలను వినియోగించడానికి ప్రయత్నిస్తుంటే, భారతదేశం నేటికీ తటస్థ విధానాన్ని అనుసరిస్తూ, అన్ని దేశాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, వాణిజ్య సంబంధాలను మెరుగు పరుచుకుంటూ అభివృద్ధి సాధన దిశగా పయనిస్తున్నది. అయితే దేశంలో అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ప్రజల జీవన ప్రమాణాల స్థాయి ఆశించినంతగా పెరగలేదు. మధ్య తరగతి జీవితాల్లో పెను మార్పులేవీ సంభవించలేదు. అవినీతి జాడ్యం పెరుగుతున్నదే తప్ప తగ్గుముఖం పట్టడం లేదు. ఎన్నికల్లో ధనం, మద్యం ఏరులై ప్రవహిస్తున్నది. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోయాయి. అవినీతితో పాటు అప్పులు కూడా కుప్పలుగా పెరిగిపోతున్నాయి.

దేశ ప్రజల తలసరి ఆదాయం 2.4 లక్షలుండగా, ప్రతి ఒక్కరిపై అప్పు 2026 నాటికి 2.2 లక్షలకు చేరవచ్చని అనధికార అంచనాలు చెబుతున్నాయి. భారతదేశం అప్పు 200 లక్షల కోట్లకు చేరిందని కొంతమంది ఆందోళన చెందుతున్నారు.

ఇదే సందర్భంలో దేశం అనేక రంగాల్లో ప్రగతి సాధించిందనే చెప్పాలి. జాతీయ రహదారులు పెరిగాయి. రవాణా సౌకర్యాలు మెరుగు పడ్డాయి. డిజిటల్ విప్లవం దిశగా దేశం పురోగమించింది. ఉపాధి అవకాశాలు వేగం పుంజుకుంటున్నాయి. దేశాన్ని పాలించిన పాలకులంతా తమ శక్తి వంచన లేకుండా తమదైన శైలిలో కృషి చేసారనే చెప్పాలి. ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు ఉచితంగా అందాలి. అనవసరమైన ఉచిత పథకాలకు స్వస్తి చెప్పడంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, దేశ అత్యున్నత న్యాయ స్థానం కీలక భూమిక పోషించాలి. రాజకీయ అవినీతిని అరికడితేనే దేశం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుంది.

ప్రజల న్యాయబద్ధమైన స్వేచ్ఛను, హక్కులను హరించే పద్ధతులను విడనాడాలి. కేంద్ర ప్రభుత్వం, దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవడానికి ప్రయత్నించాలి.

## స్వయం స్వావలంభన దిశగా..

దేశం అన్ని రంగాల్లో స్వయం స్వావలంభన సాధించడానికి కృషి చేయాలి. ఇతర దేశాలపై ఆధార పడితే ఏం జరుగుతుందో అమెరికా నిరూపించింది. డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ఇప్పటికే ప్రతీకార సుంకాల పేరుతో భారత్‌పై అక్కసు వెళ్ళగక్కడం, భారతీయుల వీసాలపై ఆంక్షలు విధించడం, వీసాల భారం పెంచడం జరిగింది. అమెరికాలో అకారణంగా భారతీయుల ఉద్యోగాలను తొలగించడానికి కుటిల యత్నాలు ప్రారంభించి, వెనక్కి పంపడానికి ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో మన దేశం యువతలోని మేధాశక్తిని దేశాభివృద్ధికి ఎందుకు వినియోగించలేకపోతున్నది?

విదేశాల్లో అత్యంత కీలకమైన బాధ్యతలు చేపడుతున్న భారతీయుల సామర్థ్యాన్ని స్వదేశంలో ఎందుకు ఉపయోగించుకోవడం లేదు? భారతదేశ జి.డి.పిలో అధిక శాతం సర్వీసు రంగం నుండి లభిస్తున్నది. భారతదేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా సర్వీసు రంగం కంటే తక్కువగా ఉన్నప్పటికీ 50 శాతం పైగా ప్రజలు ఇప్పటికీ వ్యవసాయ రంగం మీద ఆధారపడి బతుకుతున్న మాట వాస్తవం. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలకు ఆహార భద్రత ఉండదు. కాబట్టి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రజలకు కావలసిన నిత్యావసర వస్తువుల ధరలను అందుబాటు ధరలో లభించేలా చర్యలు గైకొనాలి. ఆర్థిక మాంద్యం ఏర్పడిన దేశాల్లో ప్రజలు ఆహారం కోసం వెంపర్లాడుతున్న విషయాన్ని మరవకూడదు. ప్రజల కడుపు కాలితే ఆహారం కోసం మాత్రమే ఎదురు చూస్తారు తప్ప, ధనరాశుల కోసం కాదు. భారతదేశంలో చదువుకున్న వారంతా వ్యవసాయ రంగాన్ని వదలిపెట్టి, ఇతర ఉపాధి అవకాశాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. వ్యవసాయం రైతు తలకు మించిన భారంగా మారింది. ఈ విషయాన్ని గుర్తించి వ్యవసాయ రంగానికి విశేష ప్రాధాన్యత నివ్వాలి. వ్యవసాయంతో పాటు ఇతర రంగాల్లో కూడా దేశం స్వయం స్వావలంభన దిశగా సాగాలి. గణతంత్ర భారతం సుసంపన్నమై వెలుగొందాలి.

– సుంకవల్లి సత్తిరాజు

కథ

# దుష్ట పన్నాగం

గున్నతోటవలస అనే గ్రామంలో పదవ తరగతి వరకు పాఠశాల ఉంది. పాఠశాలకు వేసవి సెలవులు ఇవ్వడంతో పిల్లలు కొంతమంది తల్లిదండ్రుల అదుపాజ్ఞలలో లేకుండా మామిడి తోటలో ఆటలాడుతూ, చెరువులో ఈత కొడుతూ కాలాన్ని వృథా చేయసాగారు. ఆ సమూహానికి విశ్వేశ్ అనేవాడు మిగిలిన వారిపై పెత్తనం చెలాయిస్తూ నాయకుడిలా వ్యవహరిస్తున్నాడు.

ఆ సమూహంలో రవిచంద్ర అనే మెతకవాడు ఉన్నాడు. వాడు అందరికీ లోకువ. మిగతా వారంతా అతడిని ఏడిపిస్తూ నవ్వుకుంటూ ఉంటారు. విశ్వేశ్ రవిచంద్రకు పిల్లలు సరదాగా ఆడుకునే బొమ్మనోటు ఒకటి ఇచ్చి గోపాల్‌శెట్టి కిరాణా కొట్టుకెళ్లి చాక్లెట్లు తెమ్మని చెప్పాడు. రవిచంద్ర ఆ నోటుతో గోపాల్ శెట్టి కొట్టుకెళ్లితే బడితపూజ తప్పదు. అమాయకుడైన రవిచంద్రకు ఆ పని అప్ప చెప్పవద్దంటూ కొందరు మంచివారు సానుభూతి చూపించారు. కానీ విశ్వేశ్ వినలేదు. "చెల్లని నోటు మంచి నోటు వెనకాల దాచి ఉంచాలి" చాకచక్యంగా ఆ మాట ఈ మాట మాట్లాడుతూ గోపాల్‌శెట్టి ఏమరుపాటుగా ఉన్నప్పుడు చెల్లని నోటు అంటకట్టాలి" అంటూ ఉపాయం చెప్పాడు విశ్వేశ్, రవిచంద్రకు. విశ్వేశ్ మాటలు ఎదురు చెప్పలేక సందేహిస్తూనే వెళ్లాడు రవిచంద్ర. అతడు వెళ్ళగానే అందరూ నవ్వుకున్నారు. దెబ్బలు తిని అవమానంతో తిరిగి వచ్చే రవిచంద్ర కోసం ఎదురు చూడసాగారు అందరూ. కానీ రవిచంద్ర గోపాల్ శెట్టి దుకాణంలో చాక్లెట్లు తీసుకుని వచ్చాడు. అందరూ ఆశ్చర్యపోయారు.



గోపాల్ శెట్టిని మోసగించడం చాలా కష్టం అనుకుంటూ వచ్చాడు విశ్వేశ్. రవిచంద్ర సులభంగా గోపాల్ శెట్టిని మోసం చేయగలగడంతో "గోపాల్ శెట్టివి డేగకళ్ళని మోసం చేస్తూ పట్టుబడితే చర్మం వలుస్తాడు" అనుకునే జనం మాటలు డొల్ల అన్న నిర్ధారణకు వచ్చాడు విశ్వేశ్.

మరొక రోజు విశ్వేశ్ చెల్లని 500 రూపాయలు తీసుకొని వెళ్ళాడు గోపాల్ శెట్టి దుకాణానికి. విశ్వేశ్ చాకచక్యంగా నోటు మార్చబోతుంటే గోపాల్ శెట్టి క్షణంలో కనిపెట్టాడు. వెంటనే గోపాల్ శెట్టి విశ్వేశ్ చెంప ఛెళ్లుమనిపించాడు.

ఆ తర్వాత వాడిని నడివీధిలో చెట్టుకు కట్టేశాడు. దారిన వెళ్లే జనమంతా గుమికూడి చివాట్లు వేశారు. తల్లిదండ్రులు కూడా వచ్చారు. బాధతో ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయారు.

తీవ్రమైన అవమానంతో విశ్వేశ్ తల ఎత్తుకోలేకపోయాడు. ఇంకెప్పుడూ అలాంటి పని చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు విశ్వేశ్. దాంతో స్నేహితులకు కూడా భయపడ్డారు. వాళ్లూ మరెప్పుడు మోసం చేయడానికి ప్రయత్నించలేదు. సరదాకి అయినా ఇతరులను మోసగించడం రవిచంద్రకి ఇష్టం లేదు. వాడు గోపాల్ శెట్టి దుకాణంలో నకిలీ నోటు మార్చడానికి ప్రయత్నించలేదు. చాక్లెట్లు తెచ్చింది తను దాచుకున్న సొంత డబ్బుతో. ఆ విషయం తెలియగానే సమూహంలోని వారంతా ఆశ్చర్యపోయారు.

– జి.సుబ్రహ్మణ్యం గౌడ్

## బాలగేయం

### చలిపులి

చలి పులి పంజా
విసిరే కాలం
గజ గజ మంటూ
వణికించే కాలం

శీతాకాలం
చల్లని కాలం
మంచు ముత్యాలు
కురిసే కాలం

మంచు బిందువులు
మెరిసే కాలం
మంచి మనసులు
మురిసే కాలం

– గుండాల నరేంద్రబాబు



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**కె.ఆశ్లేష, కనిగిరి**

**ప్రశ్న: వాన పడే ముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి?**

**జవాబు:** వర్షం పడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడే ముందు నీటి బిందువులు సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. ఈ దృష్ట్యా, వాన పడే ముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.

**బి.జగ్గయ్య, కోహెడ**

**ప్రశ్న: మేఘాలు ఎలా ఏర్పడతాయి?**

**జవాబు:** మేఘాలకు ఒక ప్రత్యేక రూపం ఉండదు. గాలిలో ఉండే అసంఖ్యాక నీటి బిందువులు, ఐస్ క్రిస్టల్స్ కలిసి ఏర్పడినవే మేఘాలు. అంటే సూక్ష్మ బిందువుల రూపంలో గాలిలో చేరిన నీరు మనకు మేఘాల రూపంలో కనపడుతుంది. చల్లగాలి కంటే వేడిగాలిలోనే తేమ ఎక్కువగా ఉంటుంది.

ఉష్ణోగ్రతా ప్రభావం వల్ల ఈ మేఘాలలోకి కొత్తగా నీటి బిందువులు వచ్చి చేరుతూనే ఉంటాయి. మేఘాలలో ఆర్ద్రతా శాతం సంతృప్తికర స్థాయికి చేరగానే అవి వర్షిస్తాయి. ఆ పరిస్థితులలో మేఘాల్లోని సూక్ష్మబిందువులన్నీ కలిసిపోయి నీటి బిందువులుగా మారతాయి. భూమ్యాకర్షణ శక్తివల్ల అవి భూమి మీద వర్ష రూపంలో పడతాయి. మేఘాలలో ఆర్ద్రతా శాతం తగినంత స్థాయిలో వున్నప్పుడు చల్లటి గాలి వీచినా వర్షం రూపంలో నీటి బిందువులన్నీ కలిసి భూమి మీదకు జాలువారుతాయి.

# పుస్తకం మస్తిష్క వికాస సాధనం

**పుస్తకం** విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాస సాధనం. విజ్ఞాన సముపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం పుస్తకమే. పుస్తకాన్ని నమ్మినవాడు మహాజ్ఞాని అవుతాడు. ఒక పుస్తకం వేల మెదళ్లను వెలిగించే జ్ఞానదీపం. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ/ జాతీయ పుస్తక పఠన దినోత్సవం (వరల్డ్/నేషనల్ రీడ్ ఏ బుక్ డే), జాతీయ గ్రంథాలయ దినోత్సవాలను నిర్వహించుకుంటున్నాం. పుస్తకాల అమూల్య విలువలు ప్రతిబింబించే అంశాలను ఏకరువు పెట్టడం జరుగుతోంది. పుస్తకాలు చదవడం ఓ నిత్య అభిరుచిగా మారాలి.

పుస్తకాలు వెలకట్టలేని వినోదాలు, విజ్ఞానాన్ని అందించే ఉపకరణాలు, కాల యంత్రాలు కూడా. కామిక్ పుస్తకాలు, ఈపుస్తకాలు, ఆడియో పుస్తకాలు కూడా నేటి డిజిటల్



ప్రపంచంలో అందుబాటులోకి రావడం శుభపరిణామం. పిల్లలతో కలిసి రోజు కాసేపు కథల పుస్తకాలు చదవడంతో వారిలో ఆశావహ దృక్పథం క్రమంగా పెరుగుతుందట.

డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. గూగులమ్మ ఒడిలో పుస్తకాలు దాక్కుంటున్నాయి. బుక్ కల్చర్ మాయమై లుక్ కల్చర్ ప్రత్యక్షం అవుతున్నది. గ్రంథాలయాలు అనాథలు అయిపోతున్నాయి. పుస్తకాలు నిరాదరణతో చిన్నబోతున్నాయి. చందమామ కథలు, బాలమిత్రలు అంతరించాయి.

బొమ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సైతం పుస్తక పఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ ల్యాప్‌టాప్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది. విశ్వ మానవాళిని పుస్చక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంథాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది.

## ప్రయోజనాలు

ఒకసారి పుస్తక పఠన సాగర ఈతను ప్రారంభిస్తే, విషయ పరిజ్ఞాన తీరాలకు చేరుతూ విజేతలుగా నిలవడానికి ప్రయత్నించాలి. పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంచగల ఇతర పుస్తకాలు, మ్యాగజైన్స్, పత్రికలు నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాన్ని చదివిన వారిని జ్ఞాన సరస్వతి దీవిస్తూ, ఉజ్వల భవిష్యత్తు, సమాజ గుర్తింపులను అందజేస్తుంది. పుస్తక పఠన అభిరుచితో ఓపిక, జ్ఞాన సంపన్నత, ఏకాగ్రత, విద్యావంతులుగా ఎదగడం, మేధో వికాసం ఫలించడం, మానసిక ఒత్తిడిని తగ్గడం సహజంగానే జరుగుతుంది. పుస్తక పఠనం మెదడుకు వ్యాయామంగా పని చేసి చురుకుగా మార్చుతుంది. పుస్తకం ఫలవంతమైన ఓ ఉత్సవంగా వర్ధిల్లుతుంది. పఠనం భారం కాదు, పరమానంద భరితం. పుస్తకాలను ప్రేమించిన వారిని ప్రపంచం అక్కున చేర్చుకుంటుంది. పుస్తక పఠనాన్ని బాల్యం నుంచే అలవాటు చేయాలని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి.

కత్తిని పదును చేయడానికి ఆకురాయి కావాలి. మెదడు చురుకుదనం పెంచడానికి పుస్తక పఠనం తోడవ్వాలి. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, పారిభాషిక పదకోశం, ఆత్మవిశ్వాసం, లోకజ్ఞానం, శాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వికాసనం, జనరల్ నాలెడ్జ్, ఆకర్షణీయ వేతనం, సమాజంలో ఉన్నత స్థానం, కుటుంబ సంక్షేమం, వ్యక్తిత్వ అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు అప్రయత్నంగా, సులభంగా పెరుగుతాయి.

నేటి ఆధునిక యువత గ్రంథాలయ దర్శనం చేస్తూనో లేదా నిదానంగా ఓ మూలన కూర్చొని అవసరం అనుకున్న పుస్తకాన్ని కొనుక్కొని పఠన ప్రపంచంలో మునిగిపోతూనో, జ్ఞాన సాగరం ఈదుతూ, ఎవరెస్టు శిఖరమంత ఎదుగుతూ, రేపటి విజ్ఞాన వివేకవంతుల సమాజ స్థాపనకు బాటలు వేసి భవిష్యత్తుకు బాధ్యత కలిగిన జ్ఞాన సంపన్నులను దేశానికి అందజేద్దాం, పుస్తకాన్ని నిత్య నేస్తంగా అక్కున చేర్చుకుందాం, దానిలోని భావరసాన్ని మస్తిష్కంలో నింపుకుందాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# భూమి చలనం-ప్రయాణ సమయ రహస్యం

మనమందరం ఎప్పుడో ఒకసారి ఆలోచించి ఉంటాం. ఇండియా నుంచి అమెరికాకు విమానం బయలుదేరితే ఎక్కువ గంటలు పడుతుంది. కానీ అమెరికా నుంచి ఇండియాకు తిరిగి వచ్చే సమయంలో తక్కువ గంటలే పడుతాయి. ఈ తేడా ఎందుకు వస్తుందో అనిపిస్తుంది. ఒకే దూరం కదా అని అనుకోవడం సహజం. కానీ ఇక్కడ భూమి తిరుగుడు పెద్ద పాత్ర పోషిస్తుంది.

భూమి తూర్పు దిశగా తిరుగుతూ ఉంటుంది. ఈ చలనం కారణంగా గాలి పొరలూ, వాతావరణ ప్రవాహాలూ కూడా అదే దిశలో కదులుతాయి. విమానం భూమి తిరుగుతున్న దిశలోనే కదులుతున్నప్పుడు అది గాలి ప్రవాహాల్ని ఎదుర్కోవలసి వస్తుంది. దాంతో ప్రయాణ సమయం ఎక్కువ అవుతుంది. కానీ విమానం భూమి తిరుగుడు దిశకు విరుద్ధంగా కదులుతున్నప్పుడు గాలి ప్రవాహాలు తోడ్పడతాయి. దాంతో ప్రయాణం తక్కువ సమయంలోనే పూర్తవుతుంది. ఉదా: ఇండియా నుంచి అమెరికా వెళ్లేటప్పుడు విమానం భూమి తూర్పు దిశలోనే కదులుతుంది. ఇక్కడ గాలి ప్రవాహాలు, భూమి చలనం కలిసి ముందుకు అడ్డు వస్తాయి. అందుకే సమయం ఎక్కువ అవుతుంది. తిరిగి అమెరికా నుంచి ఇండియా వస్తున్నప్పుడు భూమి తూర్పు దిశలోనే తిరుగుతున్నప్పటికీ విమానం వ్యతిరేక దిశలో ప్రయాణిస్తుంది. దీంతో భూమి చలనం విమానానికి అనుకూలంగా పనిచేస్తుంది. అందుకే తక్కువ గంటల్లో ప్రయాణం పూర్తవుతుంది.



ఇదే కారణంగా ఒకే దూరం ఉన్నా రెండు దిశల ప్రయాణ సమయం ఒకేలా ఉండదు. ఈ మధ్య శాస్త్రవేత్తలు భూమి చలనం ప్రభావం, గాలి ప్రవాహాలు రెండూ కలిపి చూసి ప్రత్యేకమైన ఫ్లైట్ మార్గాలు నిర్ణయిస్తున్నారు. దీని వల్ల ప్రయాణికులు తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరగలుగుతున్నారు. ఇంధనం కూడా తగ్గుతుంది. ఇప్పట్లో వచ్చిన సమాచారం ప్రకారం కొన్ని అంతర్జాతీయ ఫ్లైట్లు పాత రోజుల కంటే రెండు మూడు గంటలు తక్కువ సమయం తీసుకుంటున్నాయి. దీని వెనుక ప్రధాన కారణం భూమి చలనం, వాతావరణ మార్పులు, కొత్త సాంకేతికత కలయిక. భవిష్యత్తులో ఈ తేడా మరింత స్పష్టంగా కనిపించనుంది.

ఇలా చూస్తే భూమి తిరుగుడు కేవలం పగలు, రాత్రులు కలిగించేదే కాదు. మన విమాన ప్రయాణాలకూ ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుంది. ఇది.. మనం అనుకునేంత సరళమైన విషయం కాదు. ప్రకృతి చలనం లోపలే ఆకాశ యాత్ర రహస్యాలు దాగి ఉంటాయి.

## ప్రయాణ వేగం వెనుకున్న రహస్యం

భారతదేశం నుంచి అమెరికాకు వెళ్లే విమాన ప్రయాణం సాధారణంగా చాలా గంటలు పడుతుంది. ఉదాహరణకు ఒక విమానం ఇండియా నుంచి బయలుదేరి అమెరికా చేరుకోవడానికి ఇరవై గంటలు పట్టిందనుకుందాం. అదే విమానం తిరిగి అమెరికా నుంచి ఇండియాకు వచ్చేటప్పుడు కొద్దిగా తక్కువ సమయం పట్టిన సందర్భాలు కూడా ఉంటాయి. ఇది ఎందుకు జరుగుతుందో చాలా మందికి అనుమానం వస్తుంది. ఒకే దూరం కదా, మరి సమయం తేడా ఎలా వస్తుందో అనిపిస్తుంది.

ప్రయాణ సమయాన్ని నిర్ణయించేది కేవలం విమాన యంత్రం వేగం మాత్రమే కాదు. భూమి చుట్టూ ఎగురుతున్నప్పుడు అక్కడి గాలుల దిశ, వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా 'జెట్ స్ట్రీమ్స్' (వేగవంతమైన గాలి ప్రవాహాలు) ప్రభావం చూపుతాయి.

ఇవి భూమి మీద ఎత్తైన పొరల్లో దూసుకుపోయే బలమైన గాలులు. అమెరికా వైపు వెళ్తున్నప్పుడు విమానం ఈ గాలి ప్రవాహాలకు ఎదురుగా ప్రయాణిస్తే వేగం తగ్గుతుంది. అందువల్ల ఎక్కువ గంటలు పడుతుంది. కానీ అమెరికా నుంచి భారత్ వైపు వస్తున్నప్పుడు ఇదే గాలులు వెనుక నుంచి తోసినట్టవుతాయి. దాంతో విమానం ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ కారణంగానే సమయం తేడా వస్తుంది. భూమి తిరగడం కూడా ఒక రకంగా ప్రభావం చూపుతుంది. కానీ ప్రధాన కారణం గాలుల దిశే. ప్రస్తుతం శాస్త్రవేత్తలు విమాన మార్గాలను ఈ గాలి ప్రవాహాలను బట్టి మార్చే ప్రయత్నం చేస్తున్నారు. దాంతో సమయాన్ని తగ్గించుకోవచ్చు. ఇంధనాన్ని కూడా ఆదా చేయవచ్చు. కొన్నిసార్లు వాతావరణంలో తుఫానులు, భారీ గాలులు, మంచు పరిస్థితులు ఉన్నా విమాన సమయం మారిపోతుంది. కానీ ఎక్కువగా మనం గమనించే సమయ తేడాకు కారణం 'జెట్ స్ట్రీమ్స్' అనే వేగ గాలులే.

ఇక కొత్తగా వచ్చే సంవత్సరాలలో శాస్త్రవేత్తలు గాలి ప్రవాహాల ఆధారంగా ప్రత్యేకమైన మార్గాలు కనిపెడుతున్నారు. అంతేకాదు..

(మిగతా 22వ పేజీలో...)

కథ

# సప్తపది

గన్నవరపు నరసింహమూర్తి

**ఆ రోజు నేను ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి మా ఇంటి దగ్గర ఒక పోలీస్ కానిస్టేబుల్ నా కోసం ఎదురుచూస్తూ కనిపించాడు. అతన్ని చూడగానే నాకు ఆశ్చర్యం వేసింది.**


ఇంతలో మా నాన్నగారు వచ్చి "హేమంత్, మన మీద కోడలు మాధురి పోలీసు స్టేషన్లో 498ఎ గృహ హింస కేసు పెట్టిందిట. అందుకే కానిస్టేబుల్ వచ్చాడు. నువ్వోసారి స్టేషన్‌కి వెళ్లి ఎస్సై గారితో మాట్లాడి రా. ఆ తరువాత లాయర్‌ని గారి దగ్గరికి వెళదాం" అని చెప్పారు.

నేను ఆశ్చర్యపోతూ టీ తాగిన తరువాత ఆ కానిస్టేబుల్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కి బయలుదేరాను.

నేను రెండేళ్ల క్రితం ఇంజినీరింగ్ చదివి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. అప్పుడు నాకు మాధురితో పెళ్లి జరిగింది. ఆమె కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెళ్లిళ్ల పేరయ్య ఆ సంబంధాన్ని మాకు తెచ్చాడు. కానీ పెళ్లి తరువాత ఆమె వంశీ అనే వాడితో ప్రేమాయణం నడిపిన సంగతి నాకు తెలిసినా పెళ్లి తరువాత అవేమీ ఉండవని నేను నమ్మాను.

అయితే మాధురి రెండు నెలల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లి మళ్లీ రాకుండా అక్కడే ఉండిపోయింది. అలా వెళ్లిన మాధురి మళ్లీ మా ఇంటికి తిరిగి రాలేదు. నేను రమ్మనమని రెండు సార్లు ఫోన్ చేసి చెప్పినా ఆమె రాలేదు. ఆ తరువాత అక్కడ ఏం జరిగిందో ఏమోగానీ.. ఇప్పుడు నా మీద గృహ హింస కేసు పెట్టింది.

ఆలోచనల్లోంచి తేరుకొని నేను పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నాను. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేష్ నన్ను ఎన్నో ప్రశ్నలు వేసాడు. ఎప్పుడైనా మీ భార్యా భర్తలు గొడవలు పడ్డారా? మీ అమ్మా నాన్నలు ఆమెను బాధలు పెట్టారా? లాంటి ప్రశ్నలు వేసిన తరువాత మర్నాడు రమ్మనమని చెప్పి నన్ను వదిలేసాడు. సుప్రీమ్ కోర్ట్ ఈ మధ్యన ఈ గృహ హింస కేసుల్లో భర్త తరపు వాళ్లను సొరైన సాక్ష్యాలు లేకుండా అరెస్టులు చెయ్యొద్దని చెప్పడంతో ఇప్పుడు పోలీసులు పూర్తిగా విచారణ జరిపి అందులో నిజాలు ఉంటేనే అరెస్టుల వంటి చర్యలకు దిగుతున్నారు.



ఈ కేసు విషయంలో మా తప్పు ఏదీ లేదని వాళ్ల రెండు రోజుల పరిశోధనలో తేలడంతో మా ఇద్దర్ని కౌన్సెలింగ్‌కి పిలిచారు. ఆ మర్నాడు నేను పోలీస్ స్టేషన్‌కి కౌన్సెలింగ్ కోసం వెళ్లాను. మాధురి కూడా అక్కడికి వచ్చింది. నేను డీయస్పీ గారితో జరిగిందంతా చెప్పాను. అతను కూడా మాధురిని ఎన్నో ప్రశ్నలు వేసి తప్పు ఆమెలోనే ఉందన్న నిర్ధారణకు వచ్చాడు.

"మాధురిగారూ, మీరు బాగా చదువుకున్నవారు, అటువంటి మీరు ఏ తప్పు చెయ్యని మీ భర్త హేమంత్ మీద, అతని తల్లితండ్రుల మీద గృహ హింస కేసు ఎందుకు పెట్టారు? సరైన కారణం లేకుండా అటువంటి కేసు పెట్టడం నేరం" అని అన్నాడు ఎస్సై మహేశ్.

"ఎస్సై గారూ, నేను పెళ్లికి ముందే వంశీ అనే అబ్బాయిని ప్రేమించాను. అతన్నే పెళ్లి చేసుకుందామని అనుకున్నాను. కానీ నా తల్లి తండ్రులకు అతనంటే ఇష్టం లేదు. అందుకే నాకిష్టం లేకపోయినా బలవంతంగా హేమంత్‌తో పెళ్లి చేసారు. అందువల్ల హేమంత్‌తో ఇన్నాళ్లు మనస్ఫూర్తిగా కాపురం చెయ్యలేదు. ఇష్టంలేని పెళ్లి వల్ల ఇద్దరం ఇబ్బందులు పడ్డాడు. మనసులు కలవని, ఇష్టం లేని పెళ్లిళ్ల ఇలాగే పరిణమిస్తాయి.. ఒక విధంగా ఇది నా తప్పే. ఇందులో హేమంత్ తప్పు లేదు" అని ఎస్సై మహేశ్‌తో నిజం చెప్పి కేసుని వెనక్కు తీసుకుంది మాధురి.

..............

ఇదీ జరిగిన సంగతి. మా సంబంధం గురించి మీకు చెప్పిన పెళ్లిళ్ల పేరయ్య రామారావు గారు మా గురించి మీకు ఏమి చెప్పారో నాకు తెలీదు కానీ అసలు జరిగింది ఇది" అని చెప్పాడు హేమంత్. ఆ రోజు హేమంత్ తన తల్లితండ్రులతో కలిసి ప్రియ

అనే అమ్మాయిని చూడటానికి పెళ్లి చూపులకు వెళ్ళాడు. ఆమె తండ్రి శివరాం బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

మొదటి భార్య మాధురితో విడాకులు తీసుకున్న తరువాత హేమంత్ పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాడు.

కానీ అతని తల్లితండ్రులు వత్తిడి చెయ్యడంతో తప్పక ఈ పెళ్ళిచూపులకు ఒప్పుకున్నాడు. పెళ్లి చూపులకు ముందే ఆ సంబంధాన్ని తెచ్చిన పెళ్ళిళ్ల పేరయ్య రామారావుతో “నాకు పెళ్లి జరిగి భార్యతో విడాకులు తీసుకున్నానన్న విషయాన్ని వాళ్లకు విడమరచి చెప్పండి. ఏదీ దాచవద్దు. అలా దాచితే భవిష్యత్తులో అపోహలు తలెత్తే అవకాశం ఉంది” అని చెప్పాడు హేమంత్.

అయినాసరే పెళ్లిచూపులు సమయంలో హేమంత్ ప్రియ తండ్రి శివరాంతో జరిగిన విషయాలన్నీ మళ్ళీ చెప్పాడు.

అతను చెప్పింది విని ప్రియ తండ్రి శివరాం “మీ భార్యతో మీరు విడాకులు తీసుకున్న విషయాన్ని రామారావు గారు మాకు ముందే చెప్పారు” అన్నాడు.

అప్పుడు హేమంత్ తండ్రి రాఘవరావు “వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్లి చెయ్యాలి అన్నది ఒకప్పటి మాట. కానీ ఇప్పుడు రోజులు మారిపోయాయి. అబద్ధాలు చెప్పి పెళ్లి చేస్తే ఆ వివాహం విజయవంతమవదు సరికదా దంపతుల మధ్య అపోహలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. పెళ్లి అంటే రెండు మనసులే కాక రెండు కుటుంబాల కలయిక. అబద్ధాల పునాదుల మీద జరిగే ఏ వివాహం సాఫీగా కొనసాగదు. మా అబ్బాయి హేమంత్ ముక్కుసూటి మనిషి. ఏదీ దాచకూడదన్నది వాడి మనస్తత్వం. జరిగిన వాస్తవాన్ని మీకు చెప్పాం. ఇప్పుడు ఈ పెళ్లి విషయంలో ముందుకెళ్లాలా వద్దా అన్నది మీ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది” అని చెప్పాడు.

ఆ తరువాత హేమంత్, ప్రియ డాబా మీదకు ఏకాంతంగా మాట్లాడుకోవడానికి వెళ్లారు. “ప్రియ గారు, పెళ్లి అంటే ఇద్దరు మనుషులు కలిసి ఒకటిగా చేసే ప్రయాణం. అందులో కలిగే లాభ నష్టాలు, కష్ట సుఖాలు, రాగద్వేషాలు ఇద్దరు కలిసి పంచుకోవాలి.

“హ్యాపీ మ్యారేజెస్ బిగిన్ వెన్ వియ్ మ్యారీ ద వన్స్ వియ్ లవ్, అండ్ దే బ్లూసమ్ వెన్ వియ్ లవ్ ద వన్స్ వియ్ మ్యారీ” నేనెక్కడో చదివాను. ఇవన్నీ నేను ఎందుకు చెబుతున్నానంటే నేను డైవోర్సీని. విడాకులు తీసుకున్న వాళ్ళ మీద మరీ ముఖ్యంగా మగవాళ్ల మీద సమాజంలో ఎవ్వరికీ సదభిప్రాయం ఉండదు. స్త్రీలంటే అందరికీ ఓ సాఫ్ట్ కార్నర్. అలాగే మగవాళ్ళంటే ఒక చిన్న చూపు. అందుకే ఇటువంటి విషయాల్లో మగవాడిదే తప్పని సమాజం భావిస్తుంది. నిజానికి నాకిప్పుడు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. కొన్నాళ్ళు ఒంటరిగా జీవితాన్ని ఏ బంధాలు లేకుండా గడపాలని ఉంది. కానీ నా తల్లితండ్రుల ఒత్తిడి వల్ల తప్పక మిమ్మల్ని చూడటానికి వచ్చాను.

ఈ పెళ్లి విషయంలో మీ తల్లి తండ్రుల వత్తిడి మీ మీద లేదు కదా? ఉంటే చెప్పండి. మీకు ఏ సందేహాలున్నా ఇప్పుడే నన్నడిగి తీర్చుకోండి. పెళ్లి తరువాత విచారిస్తే ప్రయోజనం ఉండదు. మీకు మనస్ఫూర్తిగా ఇష్టం ఉంటేనే నాతో పెళ్ళికి మీ అంగీకారం తెలపండి. లేకపోతే దీని గురించి మరిచిపోదాం” అన్నాడు హేమంత్.

“మీరు ఇప్పుడు మీగురించి చెప్పారు. ఈ విషయంలో నేను కూడా మీకు కొన్ని విషయాలు చెప్పాలి. నేనూ డైవోర్సీని. నాకు కూడా అమెరికాలో పనిచేస్తున్న మోహన్ అనే అతనితో నాలుగేళ్ళ క్రితం వివాహం జరిగింది. అతని గురించి సరిగ్గా తెలుసుకోకుండా అమెరికా సంబంధమనీ నా తల్లి తండ్రులు అతనితో పెళ్లి చేసారు. కానీ అప్పటికే అతనికి అమెరికాలో ఒక అమ్మాయితో పెళ్లి అయిపోయింది. ఆ విషయాన్నీ అతను దాచి నన్ను పెళ్లి చేసుకున్నాడు. ఆ విషయం నాకు పెళ్లి తరువాత తెలిసింది.

**“నాకు పెళ్లి జరిగి భార్యతో విడాకులు తీసుకున్నానన్న విషయాన్ని వాళ్లకు విడమరచి చెప్పండి. ఏదీ దాచవద్దు. అలా దాచితే భవిష్యత్తులో అపోహలు తలెత్తే అవకాశం ఉంది” అని చెప్పాడు హేమంత్.**

నేను అతని పెళ్లి గురించి అడగ్గానే నన్ను శారీకంగా, మానసికంగా హింసించడం మొదలుపెట్టాడు. అప్పుడు నేను ఇక్కడికి వచ్చి అతని మీద గృహ హింస కేసు పెట్టాను. ఆ తరువాత పోలీసులు అతన్ని, అతని తల్లితండ్రుల్ని అరెస్టు చేసారు. రెండేళ్ల తరువాత కోర్టు నాకు అతనితో విడాకులు మంజూరు చేసింది. విడాకుల తరువాత నేను మళ్ళీ పెళ్లి చేసుకోకూడదని నిశ్చయించుకున్నాను. కానీ నా తల్లి తండ్రులు దానికి ఒప్పుకోలేదు. వాళ్ళ బలవంతం మీద చివరకు మీ సంబంధానికి ఒప్పుకున్నాను.

కానీ మీలాగే ముందే నాకు పెళ్ళై విడాకులు తీసుకున్న విషయాన్ని మీకు చెప్పమని మీ సంబంధం గురించి చెప్పిన రామారావు గారితో నేను చెప్పాను. అతను మీతో ఆ విషయం చెప్పాడో లేదో నాకు తెలియదు” అని చెప్పింది మాధురి.

“మాధురి గారు, నాకు రామారావు గారు మీకు వివాహమైన విషయం చెప్పారు.ఏ భార్యా భర్తలు విడాకులు తీసుకున్నా, ఏ వివాహం విఫలమైనా అందరూ మగవాళ్లనే తప్పుపడతారు. అలా అని నేను మగవాళ్ళను వెనకేసుకు రావటం లేదు. తప్పులు అందరూ చేస్తారు. కాబట్టి వాస్తవాల ఆధారంగా తప్పొప్పులు నిర్ణయిస్తే మంచిది.

నా ఉద్దేశంలో స్త్రీ, పురుషులు సమానం. ఒకరు ఎక్కువా ఇంకొకరు తక్కువ కాదు. చనిపోయిన నా భార్య మాధురి నా మీద గృహ హింస కేసు పెట్టింది. చాలా మంది ఎవరు గృహ హింస కేసు పెట్టినా భర్తదే తప్పనుకుంటారు. ఒకవేళ మన వివాహం జరిగినా మీ మనసులో అటువంటి అభిప్రాయం ఉండకూడదు. ఉంటే మీరు మనస్ఫూర్తిగా నాతో జీవితాన్ని పంచుకోలేరు. పెళ్లి అంటే స్త్రీ, పురుషుల జీవన ప్రయాణం. జీవితాంతం నీతో ఉంటానని ఏడడుగులు వేస్తూ చేసే ప్రమాణం. అదే సప్తపది. కాబట్టి ఏడడుగులు వేసే ముందు ఆలోచించుకొని నిర్ణయం తీసుకుంటే మంచిదనీ నా అభిప్రాయం.

ఒకసారి పెళ్లి అయిన తరువాత ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆ బంధాన్ని కొనసాగించాలి. వెనకడుగు వెయ్యకూడదు. భాగస్వామిని తప్పుపట్టకూడదు. మనిద్దరం



దైవర్సీలమే. ఇద్దరికీ పెళ్లి చేదు అనుభవాలను మిగిల్చింది. మనకి మన గురించి ముందుగా తెలిసినా జీవితాంతం అపరాధ భావం మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. పెళ్లి అంటే రెండు మనసుల కలయిక. రెండు హృదయాల ప్రియ సంగమం. కానీ మనకు మన పెళ్లిళ్ల మిగిల్చిన చేదు అనుభవాల వల్ల మనం మనస్ఫూర్తిగా కలిసి ఉండలేము. జీవితం యాంత్రికంగా గడుస్తుంది తప్ప ఆనందంగా కొత్తగా మొదటిసారి పెళ్లి అయిన వాళ్ళలా గడవదు. కొన్నాళ్ళు పోతే మన మధ్య మనస్పర్థలు తలెత్తే ప్రమాదం కూడా లేకపోలేదు. పెళ్లి అయిన కొత్తలో అన్నీ మంచిగానే కనిపిస్తాయి. కానీ తరువాత తప్పులు కనిపిస్తాయి. పెళ్లి మీద ఇదీ నా అభిప్రాయం. ఒకసారి పెళ్లి విషయంలో నేను భంగపడ్డాను కాబట్టి ఇంకోసారి అలా జరగకూడదనే ఇవన్నీ మీకు చెబుతున్నాను. కాబట్టి మనం ముందుకెళ్ళకుండా ఇక్కడితో ఆగిపోతేనే మంచిది. కొన్నాళ్ళు మనం ఆగితే మంచిది. కాలం అన్నిటికీ పరిష్కారం సూచిస్తుంది" చెప్పాడు హేమంత్.

"హేమంత్ గారు, నేను కూడా అదే విషయాన్ని మీతో చెబుదామని అనుకున్నాను. దాన్ని మీరే చెప్పారు. కాబట్టి మనం ఇక్కడితో ఆగిపోదాం. కొన్నాళ్ళు స్నేహితులుగా ఉందాం. మనం ఎలా ముందుకెళ్లాలో మన భవిష్యత్తు నిర్ణయిస్తుంది. మనకు మంచి జరుగుతుందనే నేను అనుకుంటున్నాను" అంది ప్రియ.

ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో తడిని హేమంత్ గమనించాడు.

.........................

ఇది జరిగి రెండేళ్లయింది. ఇప్పుడు హేమంత్, ప్రియ స్నేహితులు. ఒకే కంపెనీలో పనిచేస్తున్నారు. రాను రాను వాళ్ళ మధ్య అవగాహన పెరుగుతోంది. జీవితం పట్ల ఆసక్తి, అనురక్తి కలుగుతోంది.

వాళ్ళు చెప్పే మంచి కబురు కోసం ఇరు కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

(19వ పేజీ తరువాయి..)

## భూమి చలనం-ప్రయాణ సమయ రహస్యం...

కొత్త తరం విమానాలు ఎక్కువ ఇంధన సామర్థ్యంతో, తక్కువ సమయం పట్టే విధంగా తయారవుతున్నాయి. ఈ మధ్య కొన్ని ప్రయోగాత్మక ఫ్లైట్లు సాధారణ సమయం కన్నా మూడు నాలుగు గంటలు తక్కువ సమయం తీసుకుని ప్రయాణించడం ప్రారంభించాయి. ఇది భవిష్యత్తులో ప్రయాణికులకు పెద్ద సౌలభ్యం కాబోతోంది.

ఇలా చూస్తే ఒకే దూరం ఉన్నా, గాలుల గమనమే ప్రయాణ సమయాన్ని నిర్ణయించే ప్రధాన అంశం అని స్పష్టమవుతుంది. మనం కూర్చున్న విమానం నెమ్మదిగా వెళ్తోందని కాదు, ప్రకృతి ప్రవాహాలు మార్గాన్ని ఎలా దారితీస్తున్నాయో అనేది నిజమైన రహస్యం. ఇండియా నుంచి అమెరికా వెళ్లే విమాన ప్రయాణం సాధారణంగా ఎక్కువ గంటలు పడుతుంది, కానీ తిరిగి వస్తే తక్కువ సమయం పడుతుంది. దీని వెనుక భూమి చలనం, గాలి ప్రవాహాల ప్రభావం కలిసి పనిచేస్తాయి.

ఉదా: ఢిల్లీ నుంచి న్యూయార్క్ వెళ్ళేటప్పుడు దూరం దాదాపు పన్నెండు వేల ఐదు వందల కిలోమీటర్లు, వేగం గంటకు తొమ్మిది వందల కి.మీ.గా తీసుకుంటే గాలి ప్రతిఘటన కారణంగా మూడు గంటల వరకు అదనంగా పడుతుంది. అందుకే ప్రయాణం పదహారు పదిహేడు గంటలు అవుతుంది. కానీ న్యూయార్క్ నుంచి ఢిల్లీకి తిరిగి వస్తే అదే దూరం అయినప్పటికీ గాలి సహకారం లభించి రెండు గంటల వరకు తగ్గిపోతుంది. అందువల్ల 14-15 గంటల్లో చేరిపోతుంది.

ఇదే విధంగా ముంబై నుంచి శాన్ ఫ్రాన్సిస్కో వెళ్ళేటప్పుడు గాలి ప్రతిఘటన కారణంగా దాదాపు పద్దెనిమిది పందొమ్మిది గంటలు పడుతుంటే, తిరుగు ప్రయాణం పదహారు గంటల్లో పూర్తవుతుంది.

చికాగో నుంచి బెంగళూరు మార్గంలోనూ ఇలాగే మూడు గంటల తేడా గమనించవచ్చు. ఇలా ఒకే దూరం ఉన్నా, భూమి తూర్పు దిశగా తిరుగుతుండటం, జెట్ స్ట్రీమ్స్ అనే వేగవంతమైన గాలి ప్రవాహాలు విమాన వేగాన్ని తగ్గించడం లేదా పెంచడం వల్లే ఈ తేడా వస్తుంది.

– డా॥ చిటికెన కిరణ్‌కుమార్

# జననీ! నీకు వందనం

మాతృభూమిని 'వందేమాతరం' అంటూ తల్లిగా ఆరాధ్యనీయం చేసిన మహాదార్శనిక అక్షరశిల్పి బంకించంద్ర చటర్జీ భారత జాతి మహోద్యమానికి ప్రాతఃస్మరణీయులుగా నేటికీ ఆరాధ్యనీయులు.



1836 జూన్ 26న జన్మించి 1894 ఏప్రిల్ 8న స్వర్గస్థుడైన బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గేయాన్ని 1880లో గురుదేవ్ రవీంద్రనాథ్ టాగోర్ భారత జాతీయ కాంగ్రెస్ కలకత్తా 12వ మహా సమావేశంలో, తానే స్వరకల్పన చేసి ఆలాపించారు. 1905లో వైస్రాయ్, గవర్నర్ జనరల్ లార్డ్ కర్జన్ బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమంలో, వందేమాతరం బ్రిటిష్ పాలనను ఎదిరించే స్వాతంత్ర్య సమరయోధుల, విప్లవకారుల సమరనినాదంగా అఖండ భారతావనిలో ప్రతిధ్వనించింది. భారత జాతీయ కాంగ్రెస్‌తో వందేమాతరం గేయానికి శతాబ్దాల నాటి అనుబంధం వుంది. ప్రప్రథమంగా భారత జాతీయ పితామహుడు దాదాభాయ్ నౌరోజీ సమక్షంలో, జాతీయ కాంగ్రెస్ ద్వితీయ మహాసభలోని 450 మంది ప్రతినిధులు ఆ దేశభక్తి గేయం ఆలపించి ఉత్తేజితులయ్యారు. బంకించంద్రుడు ఆనందమఠం నవలలో రాసిన ఈ గేయం 1881లో ప్రచురింపబడి తొలి వెలుగు చూసింది. 1894లో దివంగతులైన బంకించంద్రుడు తన 44వ యేట ఈ గేయం రచించారు. 1905 నాటికి కాశీ భారత జాతీయ కాంగ్రెస్‌లో గోపాలకృష్ణ గోఖలే సూచనపై రవీంద్రుని మేనకోడలు సరళా దేవి చౌధురాణి ఈ గేయాన్ని ఆలపించారు. 1872-1875 మధ్య రాత ప్రతిగా వుందని భావిస్తున్న గేయం, 1905లో తమిళ జాతీయకవి సుబ్రహ్మణ్య భారతి అనువదించారు. 1907లో అరబింద్ ఘోష్ తానే స్వయంగా అనువదించిన ఈ గేయంతో విప్లవాగ్ని రగిలించారు. 'ఆనందమఠం' నవల వివిధ భారతీయ భాషలతో పాటు 1907లో ప్రదర్శన తెలుగులో కూడా అనువదించబడింది. బెంగాల్ విద్యార్థులు, యువకులు 1905 అగస్టు 7న కాలేజి స్క్వేర్ నుండి టౌన్ హాల్ వరకు ఊరేగింపు నిరసనలో ఆలపించిన 'వందేమాతరం' లోకమాన్య బాలగంగాధర తిలక్ మాటలలో చెప్పాలంటే భారత జాతీయ పునరుజ్జీవానికి, మంత్రనాదమైంది. నాటి బ్రిటిష్ ప్రభుత్వం 'వందేమాతరం' నిషేధించింది. అయినా కుమార్ మానబేంద్ర నాథ్‌రాయ్, వందేమాతరం సంప్రదాయ సొసైటీ అధ్యక్షునిగా ప్రతీ ఆదివారం, కలకత్తా వీధులలో మార్చింగ్ నిర్వర్తించేవారు. రవీంద్రుడు కూడా పాల్గొనేవారు. 1905 నాటి ఉద్యమం దేశభక్తి ప్రపూరితమై ఎందరో విప్లవ యువకులు ఉరికంబం ఎక్కే ప్రాణార్పణల త్యాగ సాహసాల మంత్ర నినాదమైంది. స్వాతంత్ర్య సమరంలో స్వచ్ఛందంగా ఉరికంబాలను ఆహ్వానించిన విప్లవ యువకులు పెదాలపై, క్రూరలాఠీల రక్తసిక్త గాయాలతో స్పృహ కోల్పోయే యోధుల నాల్కలపైన, కఠోర జైలు గోడల మధ్య వందేమాతరం ప్రతిధ్వనించింది.

'వందేమాతరం' ఆ రెండు మాటల నినాదం అర్ధ శతాబ్దికి పైగా అఖండ భారత జనావళి హృదయాలలో స్వేచ్ఛాకాంక్ష, స్వాతంత్ర్య దీప్తి రగిలించాయి. 130 యేళ్ల క్రితం బంకించంద్రుడు స్వర్గస్థులయ్యారు. ఆయన జీవిత కాలంలోని వందేమాతరం గేయానికి ప్రస్తుతం 150 యేళ్లు.దేశ స్వాతంత్ర్యానంతరం 1950 కానిస్ట్యుయంట్ అసెంబ్లీ జాతీయ గీతంగా గుర్తించినా ప్రాధాన్యత ఉన్నా న్యాయం జరగలేదు. అంతకు ముందు 1937 ఆగస్టు 14న వార్ధా కాంగ్రెస్ కమిటీలో నాటి కొందరు ముస్లిమ్ పెద్దల అభ్యంతరాలు ఎదురయ్యాయి. దానికి కారణం 23 చరణాలున్న ఆ గేయంలో దేవీ మాత ఆరాధ్యనీయం కావటం. బంకించంద్రుని కలం నుండి వెలువడిన రాజ్‌సింహా, దుర్గేశనందిని, సీతారామ్, మృణాళిని వంటి నవలల్లో కూడా, భారతమాత సర్వశక్తి స్వరూపిణి అయిన దేవీ మాతగా సాక్షాత్కరిస్తుంది.

'జనగణమన'తో సమాన గౌరవ ప్రతిపత్తుల జాతీయ గీతంగా సంభావించబడుతున్న 'వందేమాతరం'లోని మొదటి రెండు స్టాంజాలు మాత్రమే మాతృదేశ భక్తికి సంబంధించినవిగా గుర్తించబడుతున్నాయి.7 పాదాల తొలి స్టాంజాలే గుర్తింపు పొందాయి. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' శ్రీమద్రామాయణం కాలంలోని వాల్మీకి దివ్యసందేశం వందేమాతరం గేయానికి ఊపిరి పోసింది. అరాచక, అన్యాయ, నిరంకుశ, అణచివేతల తీవ్ర దోపిడీ రాజ్యవ్యవస్థ పారదోలటానికి మాతృదేశ సేవా త్యాగదీక్ష, భక్తి తత్పరత, సమరశీలత ధ్వనింపచేసిన వందేమాతరం, మాతృభూమి బానిసత్వపు సంకెళ్ళు తెంచవలసినదిగా ప్రబోధించింది. భారతమాతను దివ్యమంగళ స్వరూపిణి అయిన దేవీమాతగా సాక్షాత్కరింపచేస్తుంది. దేశమాత విముక్తికి శపథ ప్రతిజ్ఞా సంకేతంగా, దేవీమాత జగన్మాత, దుర్గామాత ఎదుట గానం చేయబడిన వందేమాతరం దేవతా పవిత్రమూర్తులతో సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం వంటి మాతృభూమి దివ్యమంగళ స్వరూపాన్ని సాక్షాత్కరింపచేసి ఆవిష్కరింపచేస్తుంది.

– జయసూర్య

# పెరుగుతున్న పర్యాటకం

భారతదేశంలో పర్యాటక రంగానికి సంవత్సరాల చరిత్ర ఉంది. ఇది ప్రాచీన కాలంలో ఆధ్యాత్మిక యాత్రలుగా మొదలై, నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే స్థాయికి ఎదిగింది. పర్యాటక రంగం దేశ, విదేశీయులకు విజ్ఞానం, వినోదం అందించడంతో పాటు పలు ప్రాంతాల ప్రగతికి దోహదపడుతుంది. నేడు ఆర్థిక వ్యవస్థకు, ఉపాధికి చోదక శక్తిగా పనిచేసే వాటిలో పర్యాటక రంగం ఒకటి. భారతదేశంలో జాతీయ పర్యాటక దినోత్సవం జనవరి 25న జరుపుకుంటారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి పర్యాటకుల దృష్టిని ఆకర్షించడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. భారతదేశంలోని పర్వతాలు, లోయలు, నదులు, బీచ్‌లు, చారిత్రక కట్టడాలు ఇత్యాది పర్యాటక ప్రదేశాలు దేశ, విదేశీయుల్ని ఆకర్షిస్తున్నాయి.

## జాతీయ పర్యాటక దినోత్సవం

మన దేశంలో మొదట జాతీయ పర్యాటక దినోత్సవాన్ని 1948లో జరుపుకున్నారు. మన దేశ ఆర్థిక వృద్ధిని పెంచడానికి, భారత్‌ని అభివృద్ధి చేసి పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ప్రారంభించారు. దేశంలో టూరిజం అభివృద్ధిని పర్యాటక మంత్రిత్వశాఖ చూసుకుంటుంది. దేశ ఆర్థికాభివృద్ధికి టూరిజం కీలకం కాబట్టి కేంద్ర, రాష్ట్ర, క్షేత్రస్థాయిలో పర్యాటకాన్ని మెరుగుపరచడానికి పర్యాటక మంత్రిత్వశాఖ అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుంది. ప్రతి ఏడాది మన ఆర్థిక వ్యవస్థలోని పర్యాటక రంగం బిలియన్ల డాలర్ల ఆదాయాన్ని తీసుకురావడానికి ప్రధానమైన భూమికను నిర్వహిస్తుంది. ఆ కారణంగా స్వదేశీ, విదేశీ పర్యాటకుల రాకను పెంచేందుకు జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మన దేశంలో పర్యాటక రంగ అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే అనేక విషయాలు తెలుస్తాయి. ప్రాచీన కాలంలో పర్యాటకం ప్రధానంగా మతపరమైనదిగా కనిపిస్తుంది. బౌద్ధ మత ప్రచారం కోసం అశోక చక్రవర్తి నిర్మించిన స్తూపాలు పర్యాటకానికి ప్రారంభ పునాదిగా చెప్పవచ్చు. చైనా నుంచి వచ్చిన ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్ వంటి యాత్రికులు భారతదేశంలోని నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలను సందర్శించి ఇక్కడి సంస్కృతిని ప్రపంచానికి చాటారు. మధ్య యుగంలో మొఘలుల కాలంలో నిర్మించిన తాజ్‌మహల్, ఢిల్లీ ఎర్రకోట, ఫతేపూర్ సిక్రీ, ఆగ్రా ఎర్రకోట, కుతుబ్‌మినార్‌తో పాటు కుతుబ్‌షాహీలు నిర్మించిన చార్మినార్, పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్న ఖజురహో, కోణార్క్, బేలూరు-హలేబీడు, సాంచి, అమృతసర్ స్వర్ణదేవాలయం భారతదేశాన్ని ఒక కళాఖండంగా



మార్చాయి. బ్రిటిష్ కాలం ఆధునిక మౌలిక సదుపాయాలలో భాగంగా 1853లో రైల్వే వ్యవస్థ ప్రారంభం కావడంతో దేశంలో ప్రయాణాలు సులభమయ్యాయి. వేసవి తాపం నుండి తప్పించుకోవడానికి బ్రిటిష్ వారు సిమ్లా, ఊటీ, డార్జిలింగ్ వంటి హిల్ స్టేషన్లను అభివృద్ధి చేశారు. ఇది వినోద పర్యాటకానికి నాంది పలికింది.

## స్వాతంత్ర్యానంతరం పర్యాటక రంగం

1945లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి సర్ జాన్ సార్జెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం పర్యాటకాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి క్రమబద్ధంగా అభివృద్ధి చేయడం ప్రారంభించింది. 1948లో దేశంలో పర్యాటక రంగాన్ని పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇదే ఏడాది మొదటి జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకున్నారు. 1966లో భారత పర్యాటక అభివృద్ధి సంస్థ ఏర్పడింది. ఇది హోటళ్లు, రవాణా, ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. 1982లో మన దేశపు మొట్టమొదటి పర్యాటక విధానాన్ని ప్రకటించారు. నేటి ఆధునిక కాలంలో భారతదేశం పర్యాటక రంగం ప్రపంచంలోనే కీలక పాత్ర పోషిస్తోంది. ఇన్ క్రెడిబుల్ ఇండియా (అతిథి దేవో భవ), దేఖో అప్నా దేశ్, ఉడాన్ పథకం (ప్రాంతీయ విమానాలు, స్వదేశ్ దర్శన్.. ఇత్యాది పథకాల ద్వారా పర్యాటక ప్రాంతాలను ఆధునీకరిస్తున్నారు. భారత జీడీపీలో పర్యాటక రంగం సుమారు 6.5 శాతం వాటాను కలిగివుండి కోట్లాది మందికి ఉపాధిని కల్పిస్తోంది. ప్రస్తుతం దర్శనీయ ప్రదేశాలే కాకుండా మెడికల్ టూరిజం, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం వంటివి బాగా ప్రాచుర్యం పొందాయి.

## 2025లో గణనీయమైన అభివృద్ధి

భారతదేశ పర్యాటక రంగం 2028 నాటికి గణనీయమైన వృద్ధిని సాధిస్తుందని వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్, భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025లో ఈ రంగం ఆదాయం, ఆర్థిక సహకారం పరిశీలిస్తే భారత పర్యాటక రంగం 2025లో సుమారు 257 బిలియన్ల

ఆదాయాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వాటాను అందించిందని అంచనా. విదేశీ సందర్శకుల ద్వారా వచ్చే ఆదాయం దాదాపు 37.5 బిలియన్లుగా ఉంటుందని భావిస్తున్నారు. స్వదేశీ పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయం సుమారు 16.8 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇలా పర్యాటక రంగానికి ఆదాయం గణనీయంగా పెరగడానికి అనేక కారణాలున్నాయి. కొత్త విమానాశ్రయాలు, హైస్పీడ్ రైళ్లు, మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యాలు పర్యాటకాన్ని పెంచుతున్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన మెడికల్ టూరిజం ఆదాయాన్ని గణనీయంగా పెంచుతున్నాయి.



## 2026లో పర్యాటకరంగం ముఖచిత్రం

భారతదేశం కేవలం ఒక దేశం కాదు, అది ఒక అనుభవం, మంచు కురిసే హిమాలయాల నుండి కన్యాకుమారి కడలి వరకు, రాజస్థాన్ ఎడారి ఇసుక తిన్నెల నుండి ఈశాన్య రాష్ట్రాల పచ్చని అడవుల వరకు ఈ గడ్డపై అడుగడుగునా ఒక అద్భుతం దాగి ఉంది. మన దేశ సంస్కృతిని, ప్రకృతిని, వైవిధ్యాన్ని గౌరవిస్తూ ప్రతి ఏటా జనవరి 25న మనం జాతీయ పర్యాటక దినోత్సవం జరుపుకుంటున్నాం. 2026 నాటికి భారత పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. అతిథి దేవో భవ అనే నినాదంతో పాటు, సాంకేతికతను జోడించి పర్యాటకులకు సరికొత్త అనుభూతులను భారత్ అందిస్తోంది. సుస్థిర పర్యాటకం, పర్యావరణానికి హాని కలగకుండా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్లాస్టిక్ రహిత పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం ఈ ఏడాది ప్రధాన లక్ష్యం. పట్టణాల రణగొణ ధ్వనులకు దూరంగా, పల్లెటూరి వాతావరణాన్ని ఆస్వాదించాలనుకునే వారి కోసం విలేజ్ టూరిజంను ప్రోత్సహిస్తున్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆధ్యాత్మిక కేంద్రాల వైపు దృష్టి మరలేలా అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. పర్యాటకం కేవలం వినోదం మాత్రమే కాదు, కోట్లాది మందికి ఉపాధినిచ్చే రంగం, హోటళ్లు, రవాణ, గైడ్లు, చిన్న తరహా వ్యాపారుల జీవనోపాధి దీనిపైనే ఆధారపడి ఉంటుంది. 2026 నాటికి భారత జీడిపిలో పర్యాటక రంగం వాటా గణనీయంగా పెరగడం మన ఆర్థిక పుష్టిని సూచిస్తోంది.

## తెలుగు రాష్ట్రాలలో పర్యాటక రంగం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ప్రభుత్వ సంస్థ. ఇది విజయవాడ కేంద్రంగా పనిచేస్తుంది. దీని ఆధ్వర్యంలో హోటళ్లు, రిసార్టులు, బస్సులు లాంటి పర్యటన సౌకర్యాలు అందచేస్తున్నది. దీనితోబాటు సమాచార, రిజర్వేషన్ కేంద్రాలు, తీరిక సమయపు పడవ ప్రయాణం, సమావేశాల కోసం ఒడ ప్రయాణం సేవలు అందచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గొప్ప చారిత్రక, సహజ నేపథ్యాన్ని సూచించే వారసత్వ, ప్రాకృతిక, సాహస, ఆరోగ్య, గ్రామీణ పర్యటన ప్యాకేజీలను అందిస్తోంది. తిరుపతి, హార్సిలీ హిల్స్, అరకు, విశాఖపట్నం, శ్రీశైలం వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో రిసార్టులను నిర్వహిస్తోంది. 63 హైటెక్ కోచ్‌లు, 29 వోల్వో కోచ్‌లు, 8 ఎయిర్ కండిషన్డ్ హైటెక్ కోచ్లు, 4 సెమీ స్లీపర్స్, 11 మినీ వాహనాలు, 1 వింటేజ్ కోచ్, 10 క్వాలిస్ వంటి పలు వాహనాలను కలిగి వుంది. ఇది విశ్రాంతి పర్యటనను కూడా ప్రోత్సహిస్తుంది.

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ వివిధ సాహస, పర్యావరణ పాజెక్టులపై దృష్టి సారించింది. భువనగిరి కోట వద్ద సాహస క్లబ్బులు ఏర్పాటు చేసి, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం అడవిలో సాహస జీప్ రైడ్‌లను నిర్వహిస్తోంది. ఈ సంస్థ 95 చిన్నా, పెద్ద పడవలను కలిగి ఉంది.

ఇతర పర్యాటకం కార్పొరేషన్లతో పోల్చితే ఇది వివిధ సరస్సులు, రాష్ట్రం ముఖ్య నదులలో నీటి క్రీడల పారాసైలింగ్ (హుస్సేన్ సాగర్) ను నిర్వహిస్తుంది. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోల్కొండ కోట, శిల్పారామం, తారామతి, బారాదరి ఇత్యాది ప్రాంతాలలో సౌండ్, లైటింగ్ ప్రదర్శనలను అందిస్తోంది.

పర్యాటకులు పర్యాటక ప్రదేశాల సందర్శనకు వెళ్ళినప్పుడు ఆ ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం మనందరి బాధ్యత. చారిత్రక కట్టడాల పైన పేర్లు చెక్కడం, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయడం వంటివి చేయకుండా బాధ్యతాయుతమైన పర్యాటకులుగా మెలగాలి. భారతదేశం అద్భుతమైన పర్యాటక గమ్యస్థానం.

– షేక్ అబ్దుల్ హకీం జాని

# వ్యాపారం సవ్యంగా సాగాలంటే?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



**ఎస్.కామాక్షి, పుత్తూరు**

ప్రశ్న: మేం నలుగురం అన్నదమ్ములం. అందరం ఒకే ఇంట్లో ఉంటున్నాం. ఉమ్మడి సంసారం. మాలో ఇద్దరికి స్వంత ఫ్లాట్లున్నాయి, వాటిని అద్దెకిచ్చారు. మరో ఇద్దరికి ఒక్కొక్కరికి 260 గజాల ఓపెన్ ప్లాట్లున్నాయి. ఇప్పుడు ఉంటున్న ఉమ్మడి ఇల్లు మాకు వాస్తుప్రభావం ఉంటుందా? లేక కొన్న ఫ్లాటు, ప్లాటు వాస్తుప్రభావం ఉంటుందా? ప్రస్తుతం మా పరిస్థితి, వ్యాపారాలు నిలకడ తప్పుదున్నట్లు అనిపిస్తోంది.

**జవాబు:** ఎవరికైనా ఒకటికంటే ఎక్కువ స్థిరాస్తులున్నప్పుడు వాటన్నింటి వాస్తు ఫలితాలు కలిపి అనుభవంలోకి వస్తూ ఉంటాయి. వాస్తు బాగున్న గృహం వలన వచ్చే మంచి ఫలితాలు(+), వాస్తు బాగాలేని గృహం వలన వచ్చే చెడు ఫలితాలు(–).

ఈ ప్లస్‌లు, మైనస్ కలిపితే వచ్చే ఫలితం మైనస్ కావచ్చు, ప్లస్ కూడా కావచ్చు. ఒకటి కంటే ఎక్కువ స్థిరాస్తులు ఉన్నప్పుడు మిశ్రమ ఫలితాలు ఇలాగే ఉంటాయి. కానీ అతడు ఏ ఇంట్లో అయితే నివాసం ఉంటున్నాడో ఆ ఇంటి వాస్తుప్రభావం అతని మీద ఎక్కువగా పని చేస్తుంది. మీ విషయంలోనూ అంతే! మీరంతా కలిసి ఒకే ఇంట్లో ఉండటం వలన ఆ ఉమనమడి ఇంటి వాస్తు ప్రభావం మీ మీద ఎక్కువగా ఉంటుంది. కొన్న ఫ్లాటు కిరాయికిచ్చి ఉంటే, ఆ కిరాయిదారులు కూడా ఆ వాస్తు ప్రభావాన్ని పంచుకుంటారు.

ఓపెన్ ప్లాటుకు ప్రహరీగోడలు కట్టకపోతే ఒక రకంగానూ, కడితే మరొక రకంగానూ ఆ వాస్తు మంచి/చెడు తీవ్రత ఆ యజమానులకు అనుభవంలోకి వస్తుంది. ఒకసారి వాస్తు చూపించుకొని సలహా పొందటం మంచిది.

## కరెంటు బల్బులు ఏ దిక్కులో ఉండాలి?

**సి.మధుబాబు, కొడంగల్**

ప్రశ్న: కరెంటు బల్బులు ఏ దిక్కులో ఉండాలి? ప్రతి ఇంట్లో బల్బులుగానీ, ట్యూబులైట్లుగానీ, వైరింగ్ కానీ ఏ దిక్కు గోడలకు వచ్చేట్లుగా ఉండాలి? నా భార్య పేరుతో ఏ ముఖ ద్వారం, ఏ దిక్కున వచ్చేట్లు చూసుకోవాలి?

**జవాబు:** ప్రతి గదిలో తూర్పు, పడమర గోడలకు విద్యుత్ దీపాలను అమర్చుకోవడం ప్రథమ ప్రాధాన్యంగా ఉంటుంది. అవసరార్థం బల్బులను ఎక్కడైనా అమర్చుకోవచ్చు. వ్యవహారనామ రీత్యా మీకు, మీ భార్యకు కూడా తూర్పు ముఖద్వారం యోగిస్తుంది.

## పరిష్కారం ఏమిటి?

**బి.కార్తిక్, విజయనగరం**

ప్రశ్న: నేను ఇంతకు ముందు ఒక ఉత్తరం రాసి సమస్య గురించి వివరించాను. గతంలో మా స్నేహితులు మీ వద్ద వ్యాపారరీత్యా క్రమంగా సలహాలు, రెమెడీలు తీసుకుని పాటించారు. మీరు చెప్పిన సలహాలు పాటించినందువల్ల వాళ్ళ మంచి ఆర్థిక పరిస్థితిలో ఉన్నా. అందువల్ల మీ మీద నమ్మకంతో ఉన్నాను. నా సమస్యలకు పరిష్కారం చూపించగలరు.

**జవాబు:** నేను విజయనగరం పర్యటనకు వచ్చినప్పుడు మీరు తప్పకుండా కలవండి. మీ సమస్యలు త్వరలో పరిష్కారమయ్యేలా సులభమైన ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలు తెలియజేస్తాను.

✦

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................
చిరునామా:............................................

– రాజులకు సాధారణంగా మంచి సలహాదారులు ఉంటారు. మంచి సలహాదారులను పొందడానికి అతను విజ్ఞుడై ఉండాలి. – డయోజనిస్

# చాతుర్యం

అదొక చిన్న పట్టణం. కొన్నేళ్ళ క్రితం నాటి మాట. ఓ వ్యాపారి దగ్గర బోలెడంత డబ్బుంది. అతని దగ్గర ఓ పెద్దతను అప్పు తీసుకున్నాడు. అతనేమీ సుందరాంగుడు కాడు. అయితే అతను ఆ వ్యాపారి కూతురుని ప్రేమిస్తాడు. ఆమెను ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. తనంటే వ్యాపారికి ఇష్టమన్న సంగతి గ్రహిస్తాడు. అవకాశం కోసం చూస్తున్నాడు.

ఓ రోజు ఈ వ్యవహారం ఆయన ముందుకొచ్చింది. వ్యాపారి ఓ మాట అన్నాడు. తన కూతురుని పెళ్ళి చేసుకుంటే నీ అప్పంతా మాఫీ చేస్తానంటాడు. అయితే తానేదో నిజాయితీపరుడైనట్టు నిరూపించాలనుకుని ఓ దొంగనాటకం ఆడుతాడు. అప్పు తీసుకున్న పెద్దతను కావాలనే ఓ ప్రతిపాదన చేస్తాడు.

“నేను ఓ సంచిలో రెండు చలవరాళ్ళు ఉంచుతాను. అవి తెలుపు, నలుపు రాళ్ళు. మీ కూతురు ఆ రెండు రాళ్లలో ఏదో ఒక రాయి తీస్తే దాన్ని బట్టి నా అడుగుంటుంది..” అని–

మళ్లీ “ఆమె నల్ల రాయి తీస్తే మీరు నా అప్పు మాఫీ చేయాలి. అలాగే మీ అమ్మాయినిచ్చి నాకు పెళ్ళి చేయాలంటాడు. అలా కాకుండా మీ అమ్మాయి తెల్లరాయి గానీ తీస్తే అప్పు మాఫీ అవుతుంది. మీ కూతురుని నాకిచ్చి పెళ్ళి చేయనక్కరలేదు” అని అంటాడు.

వ్యాపారి ఒప్పుకుంటాడు. ఇక్కడో విషయం గమనించాలి. ఈ మాటల తతంగమంతా ఆ వ్యాపారి ఆవరణలో ఉన్న పెద్ద తోటలో జరుగుతుంది.

వ్యాపారి రెండు చలవరాళ్ళు తీసి సంచీలో పెట్టుకోమంటాడు.



అప్పు తీసుకున్న పెద్దతను ఇక ఆలస్యం ఎందుకన్నట్టు తోటలో ఓ చోట నిల్చుని కిందకు వంగి రెండు రాళ్ళు తీస్తాడు. ఆ రెండు రాళ్ళూ నల్ల రంగువే. ఈ విషయాన్ని వ్యాపారి కూతురు చూసింది. కనుక ఆమె ముందు మూడు ప్రత్యామ్నాయాలున్నాయి. అవి:

ఒకటి: సంచీలోంచి చలువరాయి తీయడానికి తిరస్కరించడం.

రెండు: సంచీలోంచి రెండు రాళ్ళూ ఒకేసారి తీసి అతని అనైతికతను బయట పెట్టడం.

మూడు: విషయం తెలుసు కనుక తండ్రిని తృప్తి పరచడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసుకుంటూ ఓ రాయి తీసి ఆ పెద్దతనికి భార్య కావడం.

తండ్రి ఓ రాయి తీయమంటాడు.

ఆమె “సరేనని” సంచీలోంచి ఓ రాయి తీసినట్టే తీసి నేలమీద ఉన్న మిగిలిన రాళ్ళమధ్య కావాలనే చేజారుస్తుంది. అంతేకాకుండా ఆ పెద్దతనితో “నేనెంత దురదృష్టవంతురాలినో కదూ! సంచీలో మిగిలి ఉన్న రాయి మీకు తెలియంది కాదు. నేల మీద పడేసిన రాయి రంగేంటో మీకు తెలుసు. అదెందుకు పడిపోయిందో కూడా మీకు అర్థమయ్యే ఉంటుంది. ఇప్పుడు సంచీలో ఉన్నది నల్ల రాయే అన్న సంగతి మీకు తెలుసు” అని అంది.

పెద్దతనికి పరిస్థితి అర్థమైంది. తన దుర్బుద్ధి ఎక్కడ బయట పడుతుందో అని భయపడ్డా వ్యాపారికి అసలు విషయం తెలీదు కనకు తాను బతికానని అనుకుంటాడు మనసులో.

సంచిలో ఉన్నది నల్లరాయి కాబట్టి తన కూతురు చేజార్చిన రాయి తెల్ల రాయే అయి ఉంటుందనుకుంటాడు వ్యాపారి. ముందనుకున్న ఒప్పందం ప్రకారం వ్యాపారి అతని అప్పు మాఫీ చేస్తాడు. అమ్మాయితో పెళ్ళి జరగదు.

ఈ కథతో తెలుసుకోవలసినదేమిటంటే– ఎటువంటి క్లిష్టపరిస్థితినైనా అధిగమించవచ్చు. కానీ ఓ సమస్య ఎదురైనప్పుడు దాని నుంచి బయట పడడానికి కావలసినదల్లా చాతుర్యం. అంతే తప్ప కంగారు పడిపోవడం కాదు. దాని పడడం వల్ల ఏ లాభమూ ఉండదు. తనను తాను బయట పడటమే కాకుండా అవతలి వ్యక్తి అనైతికతనూ బయటపెట్టడం తనకు ఇష్టం లేక నడచుకున్న తీరుకు మనసులో సంతోషిస్తుంది. ఆమె తన చతురతతో ఆ పెద్దతనిని పెళ్ళి చేసుకునే స్థితి నుంచి సురక్షితంగా బయటపడింది.

– యామిజాల జగదీశ్

– చనిపోయినవారు జీవించి వున్నవారికి మార్గదర్శకులు. నీకు నీవే దీపమయితే ఎలాంటి సమస్య లేకుండా పోతుంది.

– సంస్కర్తలందరూ బ్రహ్మచారులే.

– తక్కువగా మాట్లాడటమే, ఎక్కువగా తెలిసిందనటానికి ఆధారం.

– సత్యసాయిబాబా

# మునగాకు @ 96 పోషకాలు!

మునగ 5 వేల సంవత్సరాల క్రితమే భారత్‌లోని హిమాలయాల్లో పుట్టి ఆసియా, ఆఫ్రికా ఖండమంతటా పెరిగే అద్భుత చెట్టుగా గుర్తించారు. ఆయుర్వేదంలో దాదాపు 300 వ్యాధుల్ని నయం చేసే మునగచెట్టుని ఆయుర్వేద అమృతం, ఆయుర్వేద నిధి అని అంటారు. 96 పోషకాలున్న ఒకే ఒక చెట్టు మునగచెట్టు అని చెప్పవచ్చు. ఉత్తర భారతదేశానికి చెందిన దీన్ని కరువు నిరోధక చెట్టు అని పిలుస్తారు. దక్షిణ భారతదేశంలో దాదాపు 500 వ్యాధులకి గ్రామీణులు సంప్రదాయ మూలికా ఔషధంగా వినియోగిస్తారు. దీనికి చెట్టులోని ఆకు నుండి వేరు దాకా ఔషధాల గనిగా ప్రత్యేక స్థానం ఉంది.



ఇది ఉష్ణమండల మొక్క. పొడి ప్రాంతాలకి అనువుగా ఉంటుంది. దీని ఆకులు, బెరడు, కాయలు, పువ్వులు, కొమ్మలు, పసరు అన్నీ పేదవాడి ఆహారంగా, ది నెక్స్ట్ క్వినోవాగా ప్రత్యేక స్థానాన్ని కల్గి ఉంటుంది. దీని శాస్త్రీయ నామం మోరింగా ఓలేఫెరా. ఇది మోరింగేసి ఫ్యామిలీకి చెందినది. దీనిలో 13 రకాల జాతులున్నాయి.

**పోషక విలువలు**

**100 గ్రా. మునగాకులో..**

తేమ: 75 గ్రా. : 92 కిలో కేలరీలు
ప్రొటీన్స్: 6.7గ్రా.: కార్బోహైడ్రేట్స్: 14 గ్రా.
కొవ్వు: 2గ్రా. : ఫైబర్ 2.5 గ్రా.
కాల్షియం: 445 మి.గ్రా.: ఫాస్పరస్ 70 మి.గ్రా.
ఐరన్: 7గ్రా. : అయోడిన్ : 51 మి.గ్రా
కాపర్ 101 మి.గ్రా : విటమిన్ బి: 220మి.గ్రా.
విటమిన్ ఎ : 11.300 టి4 : విటమిన్ సి: 200 మి.గ్రా. మెగ్నీషియం : 147 మి.గ్రా. పొటాషియం: 337 మి.గ్రా. ఖనిజ లవణాలు: 2.3 శాతం
ఆక్సలేట్స్: 430 : 1050 మి.గ్రా.

**ఆరోగ్యప్రయోజనాలు**

మునగాకులో 46 రకాల యాంటి ఆక్సిడెంట్ల భాండాగారం వుండడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతున్నాయి. అంతే కాకుండా క్యారట్ కన్నా 10 రెట్లు విటమిన్ ఎ, పాలకన్నా, 17 రెట్లు పెరుగు కన్నా 9 రెట్లు, అరటిపండు కన్నా 15 రెట్లు, బచ్చలి, పాలకూర కన్నా 24 రెట్లు ఎక్కువ పోషకాలు మునగాకులో ఉన్నాయి.

**స్థూలకాయం:** మునగాకులోని క్రోరోజెనిక్ ఆసిడ్ శరీరంలో నిల్వ ఉండే కొవ్వుని, పొట్ట చుట్టూ పేరుకు పోయిన కొవ్వుని కరిగించి అధిక బరువుని తగ్గిస్తుంది. ఇది రక్తంలో, శరీరంలో కొవ్వు శాతాన్ని తగ్గించి బిఎమ్ఐని మెరుగు పరుస్తుంది. **కిడ్నీలు:** ఇది కిడ్నీ రాళ్లను కరిగించి మూత్రం ద్వారా బైటకి పంపిస్తుంది. మూత్ర విసర్జనలో మంట, నొప్పి, ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తుంది. డయూరిటిక్‌గా పని చేస్తుంది. కిడ్నీ డామేజ్ కాకుండా కాపాడుతుంది.

**లివర్:** ఇది లివర్‌ని డేటాక్స్ చేస్తుంది. లివర్ సిర్రోసిస్ కామెర్లు, హెపటైటిస్ ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు రాకుండా అరికడుతుంది. గాల్ బ్లాడర్‌ని స్టిములేట్ చేసి పైత్యరస ఉత్పత్తిని పెంచుతుంది. పిత్తాశయంలో రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది.

**గుండె/ బి.పి :** మునగాకులోని బ్యూటనాల్, ఫ్లేవనాయిడ్స్ వల్ల రక్తంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ని పెంచుతుంది. బీటాకెరోటిన్, క్వెర్సెటిన్, ఒమేగా-3, ఫ్యాటీ ఆసిడ్స్ బి.పి.ని నియంత్రించి గుండె పని తీరుని మెరుగు పరుస్తుంది. గుండెపోటు పక్షవాతం గుండె జబ్బులు రాకుండా గుండె సమస్యల్ని దూరంగా ఉంచుతుంది. ఇది హైపోలివిడెమిక్‌గా రక్తనాళాల్ని గట్టిపరిచి బ్లాక్‌లు ఏర్పడకుండా చేస్తుంది.

**డయాబెటిస్:** మునగాకులోని ప్రొటీన్స్, క్లోరోజెనిక్ యాసిడ్ రక్తంలో షుగర్ లెవల్స్ తగ్గించి గ్లూకోజ్ మెటబాలిజాన్ని మెరుగ్గా ప్రాసెస్ చేయడంలో సహాయపడతాయి. దీనిలోని జింక్ వల్ల మునగాకు ఇన్సులిన్ లాగా పనిచేసి ఇన్సులిన్ రెసిస్టెన్సివిటీని పెంచి 40 శాతం వరకు షుగర్‌ని తగ్గిస్తుంది. ఇది యాంటి డయాబెటిక్‌గా షుగర్‌ని రాకుండా చేస్తుంది.

**జీర్ణాశయం:** గ్యాస్ట్రయిటిస్, కడుపుబ్బరం మలబద్ధకం, విరేచనాలు, ఎక్కిళ్లు, అజీర్ణం, అల్సరేటివ్ కొలైటిస్, అతిసారం అల్సర్‌లు వంటి జీర్ణకోశ సమస్యల్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియకు అవసరమయ్యే ఫైబర్ వల్ల అరుగుదల సమస్యల్ని తగ్గించి, తిన్న ఆహారాన్ని శరీరానికి వంటబట్టేలా చేస్తుంది. పెద్ద ప్రేవుల్ని శుభ్రం చేసి

శరీరంలోని టాక్సిన్స్‌ని బైటికి పంపుతుంది. ఇంకా కడుపులోని నులిపురుగులు, కొంకి పురుగుల్ని నిర్మూలిస్తుంది. కలుషిత ఆహారం నీరు ద్వారా వచ్చే ఈకొలై, స్టఫలోకాకస్ ఇన్ఫెక్షన్స్ వల్ల వచ్చే ఫుడ్ పాయిజనింగ్ రాకుండా చేస్తుంది. కడుపులోని అల్సర్స్‌ని 85 శాతం తగ్గిస్తుంది. ఇది సహజ భేది మందుగా పని చేస్తుంది.

**ఎముకలు:** మునగాకు రసాన్ని కొద్దిగా పాలలో కలిపి పిల్లలకి ఇచ్చిన ఎముకలు దృఢంగా పెరుగుతాయి. చిగుళ్ల వాపు అథ్లెటిక్ ఫుట్, రుమాటాయిడ్ ఆర్థ్రాయిటిస్, సయాటికా, పిప్పిపళ్లు, నడుం నొప్పి, మెడనొప్పి వంటి వ్యాధులు రావు. మునగాకులోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాల వల్ల ఎర్రికోస్కిరోసిస్, ఎముకలు అరుగుదల, కీళ్లవాపులు, నొప్పులు, బెణుకు నొప్పులు, ఎముకలకు దెబ్బలు, గాయాలు, దెబ్బలు తగిలినవారికి, ఎముకలు విరిగిని వారికిది మేలు చేస్తుంది. **కన్ను** : విటమిన్ 'ఏ'గా మారడం వల్ల పిల్లల్లో రేచీకటి, అంధత్వం, శుక్లాలు, కంటి వ్యాధులు రావు. కంటిచూపు మెరుగ్గా ఉంటుంది. బీటా కెరోటిన్లు విటిమిన్‌ఎగా మారడం వల్ల పిల్లల్లో, వృద్ధుల్లో, యువి లైట్ల కాంతి వల్ల కలిగే అనేక కంటి సమస్యల్ని అరికడుతుంది. **రక్తం:** మునగాకులోని ఐరన్ వల్ల సికిల్ సెల్ అనేలియా (అధిక ఐరన్‌తో వచ్చే వ్యాధుల్ని) రక్తహీనతని తగ్గిస్తుంది. ఇది రక్తశుద్ధిని కల్గిస్తుంది. రక్తప్రసరణని మెరుగు పరుస్తుంది. అధిక రక్త స్రావాల్ని అరికడుతుంది.

**సౌందర్యపోషణ, జుట్టు:** మునగాకులోని బయోటిన్ జుట్టురాలడం నెరవడం, బట్టతల రావడం చుండ్రు, దురదలు వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. ఇది హెయిర్ టానిక్‌గా పనిచేసి కేశ సౌందర్యాన్ని పెంపొందిస్తుంది. **చర్మం:** ఇది చర్మం పొడిబారడం, దురదలు, గజ్జి, తామర, నల్లని మచ్చలు, మొటిమలు, బ్లాక్‌హెడ్స్, దీర్ఘకాలిక మంటలు, తిమ్మిర్లు, డెర్మాటైటిస్, ఫంగల్ ఇన్ఫెక్షన్స్, పులిపిర్లు, ముడతలు, యువి కిరణాల నష్టాన్ని సన్‌బర్న్‌ని, అనేక చర్మవ్యాధుల్ని పుండ్లు, పొక్కుల్ని తగ్గిస్తుంది. మునగాకులోని ఫినాలిక్స్ చర్మంలోని మృతకణాల్ని తొలగించి హైడ్రేట్‌గా ఉంచి మృదువుగా కాంతివంతంగా ఉంచి చర్మ సంరక్షకు యాంటీ ఆక్సిడెంట్‌గా, యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా, యాంటీ సెప్టిక్‌గా పని చేస్తుంది.

**స్త్రీలు:** స్త్రీలలో హార్మోన్ల ఇన్‌బాలెన్స్ వల్ల వచ్చే బహిష్టు సమస్యలకి, బహిష్టు నొప్పి, రక్తహీనత, పిసిఓడికి మంచి ఆహారం మెనోపాజిల్ లక్షణాలకి మెనోపాజ్ తర్వాత వచ్చే లక్షణాలకి మునగాకు వరప్రదాయిని ఇది. గర్భిణులకి, బాలింతలకి మంచిది. పిండం ఎదుగుదలకి, సుఖప్రసవానికి మునగాకుని ఆహారంలో కొద్దిగా తీసుకోవడం మంచిది. మునగాకు గెలాక్టగాగ్‌గా బాలింతల్లో పాలు పడేలా చేస్తుంది.



ప్రసవానంతరం త్వరగా కోలుకుంటారు. థైరాయిడ్ గ్రంథి సమస్యలకి మునగాకు సంజీవినిలాగా పనిచేస్తుంది.

**పురుషులు:** ఇది టెస్టోస్టిరాన్ హార్మోన్‌ని పెంచి నపుంసకత్వాన్ని శీఘ్రస్కలనాన్ని తగ్గిస్తుంది. లైంగిక ప్రేరణని పెంపొందిస్తుంది. వంధ్యత్వాన్ని తగ్గిస్తుంది. గనేరియా సిఫిలిస్, వరిటి, సుఖవ్యాధులకి, వరిబీజంకు మంచిది. మెదడు/ నరాలు: తలనొప్పి మైగ్రేన్ నరాలక్షీణత, పిచ్చి, చిత్త వైకల్యం, ఆల్జీమర్స్ డిసీజ్, మతిమరుపు, డిప్రెషన్, ఎపిలెప్సీ, మల్టీపుల్ స్కిరోసిస్ తలదిమ్ముని తగ్గించేది ఇది. జ్ఞాపకశక్తిని, ఏకాగ్రతని పెంచుతుంది. దీనిలోని న్యూరో ప్రొటెక్టివ్ నేచర్, యాంటీ ఆక్సిడెంట్ల వల్ల నర్వస్ వాపు, నొప్పిని, వాపుల్ని తగ్గిస్తుంది. **ఇమ్యూనిటీ :** ఇది ఆరెంజ్ కన్నా 12 రెట్లు ఎక్కువగా విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్లు కలిగి ఉండడం వల్ల మునగాకు యాంటి బయాటిక్‌గా పనిచేస్తుంది ఇది. **కేన్సర్స్:** మునగాకులోని నియోంజియెనైన్ అనే యాంటి కేన్సర్ కారకాల వల్ల లంగ్, లివర్, కోలోరెక్టల్, చర్మం, బవేరియన్ గర్భాశయం కేన్సర్ అండాశయ కేన్సర్, పెద్దపేగు కేన్సర్, పాంక్రియాలిక్ కేన్సర్, అండాశయ కేన్సర్, పెద్ద పేగు కేన్సర్, పాంక్రియాటిక్, మెమా కేన్సర్ రాకుండా నివారిస్తుంది. దీనిలోని గ్లూకో మొరింజ సమ్మేళనం వల్ల కేన్సర్ కణాల పెరుగుదలని మందగించేలా చేస్తుంది. కీమోథెరపీ మెరుగ్గా పనిచేయడంలో సహాయపడుతుంది.

**జాగ్రత్తలు:** దీనిలోని పెన్సిలిన్ గుణాల వల్ల షుగర్ రోగులకి మంచిది. రోజుకి 70 గ్రాముల చొప్పున 5,6 నెలల వరకు వాడవచ్చు. ఇది యాంటిసెప్టిక్‌గా, యాంటీ ఇన్ఫెక్టివ్‌గా తీవ్రవ్యాధుల్ని దూరంగా ఉంచుతుంది. మునగాకు విత్తనాలు మూడు నెలల వరకు వాడవచ్చు. ఇది యాంటీ సెప్టిక్‌గా, యాంటీ ఇన్ఫెక్టివ్‌గా తీవ్రవ్యాధుల్ని దూరంగా ఉంచుతుంది. స్త్రీలలో థైరాయిడ్, హార్మోనుల చర్యల్ని నార్మల్‌గా ఉంచుతుంది. దీన్ని 3-4 నెలలు తీసుకుంటే సరిపోతుంది. దీనిని బి.పి, షుగర్, కిడ్నీ, లివర్ వ్యాధులున్నవారు మితంగా తీసుకోవాలి. ఎక్కువ తీసుకుంటే కిడ్నీలు దెబ్బతింటాయి. ఇది వారానికొకసారి తీసుకుంటే 90% వ్యాధులు తగ్గుతాయి. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుతుంది. పిల్లల ఎదుగుదలకి 1-2 స్పూన్లు ఇవ్వడం మంచిది. ఇది రక్తాన్ని పల్చబడేలా చేస్తుంది. కాబట్టి రక్త స్రావాలున్నప్పుడు గుండె జబ్బులున్న వారు వాడరాదు. హెచ్ఐవి, ఎయిడ్స్, కరోనా, జికా నిఫావైరస్ వంటి తీవ్రవ్యాధులున్న వారు 6 నెలలు వాడితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీనిని గర్భిణులు మితంగా తీసుకోవాలి. బాలింతలు పాలు పడడానికి 4 నెలలు వాడవచ్చు. తరచు జలుబు, జ్వరాలతో బాధపడేవారు కేన్సర్ రోగులు తప్పకుండా తీసుకోవాల్సిన ఆహారమనే చెప్పాలి. పోషకాల పవర్‌హౌస్ అయిన మునగాకు ఆకుకూరని ఆహారంలో భాగంగా తీసుకోవడం ఆరోగ్యానికి అన్ని విధాల శ్రేష్టం.

**- డా॥ కె.ఉమాదేవి**

# 25 జనవరి, 2026 నుండి 31 జనవరి, 2026 వరకు



## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. ఋణాలు తీరి మానసిక ప్రశాంతత పొందుతారు. జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్యక్రమాలు చేపడతారు. బంధువుల ద్వారా అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. గృహాల, స్థలాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు. మిత్రులు,సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

### వృషభం

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటుంది. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. నిత్యం జిల్లేడు వత్తులతో దీపారాధన చేయడం వలన సమస్యలు కొంతవరకు తీరతాయి. కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. రాజకీయ, కళారంగాల వారికి ప్రోత్సాహంగా ఉంటుంది.

### మిథునం

ఈ వారం ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఆరోగ్యం వాహనాల విషయంలో మెలకువ అవసరం.మీ నైపుణ్యమునకు. తెలివితేటలకు గాను, సమాజములో మంచి గౌరవ-ప్రతిష్టలు పెంపొందుతాయి. సమావేశములకు, చర్చలకు అధ్యక్షత వహించమని ఆహ్వానిస్తారు. వాహనాలు నడిపే టప్పుడు జాగ్రత్త అవసరం.

### కర్కాటకం

ఈ వారం గృహ సంబంధమైన విషయములు అనుకూలంగా, ప్రోత్సాహకరంగా ఉంటాయి. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. ఎంతగానో ఉపకరిస్తాయి. దీర్ఘాలోచనలు చేస్తారు. ప్రజా సంబంధాలను విస్తృత పరచుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తారు. సాఫ్ట్వేర్ రంగంలోని వారికి, చిన్నతరహా పరిశ్రమల వారికి అనుకూలంగా ఉంటుంది.

### సింహం

ఈ వారం వ్యతిరేక వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. నష్టం రావలసిన చోట నష్టం రాదు. కొద్దిపాటి మానసిక ఆందోళనకు గురి చేసినా, ఆచరణలో చెడుఫలితాలను మాత్రం ఇవ్వదు. విదేశాలలోని మీ బంధుమిత్ర వర్గ సహాయ సహకారాలు అందుకుంటారు. ముఖ్యమైన జటిలమైన సమస్యలు పరిష్కారమవుతాయి. స్పెక్యులేషన్ మధ్యస్తంగా ఉంటుంది.

### కన్య

ఈ వారం ఆర్థిక సర్దుబాట్లను నేర్పుగా చేసుకోగలుగుతారు. అనతి కాలంలో ప్రారంభించబోయే నూతన కార్యక్రమాలకు గాను మితంగా శ్రమిస్తారు. ఒక విషయంలో ఇంతకాలం చోటు చేసుకున్న స్తబ్దత సడలుతుంది. ప్రత్యర్థి వ్యూహాలను అమలు పరుస్తారు. ఎవరినీ ఏ సహాయం అర్థించకుండా స్వయంగా మీపనులను మీరే పర్యవేక్షించుకుంటారు. నాగసింధూరం ధరించండి.

### తుల

ఈ వారం ఇంటా బయటా అనుకూలమైన వాతావరణం ఉంటుంది. కొత్త మిత్రులు పరిచయమవు తారు. చర్చలు ఫలిస్తాయి. అందరిలోనూ ప్రత్యేక గౌరవం పొందుతారు. భూముల, భవనాలు, నూతన విద్యా, ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. బంధువులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు రాగలవు. రాజకీయ కళారంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. షేర్లు, భూముల క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

### వృశ్చికం

ఈ వారం ప్రజా సంబంధాలను వృద్ధి చేసుకో గలుగుతారు. లలిత కళల పట్ల అభిరుచిని కనబరుస్తారు. చిన్న తరహా పరిశ్రమల వారికి చిరు వ్యాపారస్తులకు సాఫ్ట్వేర్ రంగం లోని వారికి అనుకూలంగా ఉంటుంది. అనుకున్న విధంగా నిర్ణయాలను అమలు చేయగలుగుతారు. శుభప్రదమైన ఖర్చులను గ్రహస్థితి సూచిస్తోంది. ఎదుటివారు చెప్పేది ఆసాంతం వినడం, విసుగు, కోపాలకు దూరంగా ఉండటం వలన లాభపడ గలుగుతారు.

### ధనస్సు

ఈ వారం ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. మీకు గౌరవ ప్రతిష్ఠలు పెంపొందుతాయి. సత్కారాలు కూడా లభిస్తాయి. మీ కింద పనిచేసే సహోద్యోగులు, భాగస్వాములు, సోదర, సోదరీమణుల వర్గాల విషయాలో మీ దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. రోజు వారీ దైనందిన కార్యక్రమాలలో మార్పులు కనిపిస్తాయి. ఎన్ని విఘ్నాలు ఎదురైనా ఒక ముఖ్య విషయంలో మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారు.

### మకరం

ఈ వారం ప్రయాణ సమయాలలో వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించండి. వృత్తి, వ్యాపార, కార్యాలయాలలో స్వల్పమైన ఒడిదుడుకులు చోటుచేసుకున్నా సర్దుబాటు చేసుకొనే విధంగా ఉంటాయి. కట్టుదిట్టమైన ప్రణాళికలు ఉన్నప్పటికీ సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. అవసరాలకు తగినంత ధనమును కలిగి ఉంటారు. కలిసి ఉంటే కలదు సుఖం అని భావిస్తారు. అందరిని కలుపుకుంటారు.


### కుంభం

ఈ వారం వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. వ్యక్తిగత పురోభివృద్ధికి మరింతగా శ్రమించవలసి ఉందని భావిస్తారు. ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఉపయుక్తం లేని బాధ్యతలను స్వీకరించవలసి వస్తుంది. సలహాలు, సూచనలు ఇచ్చే వారు ఎక్కువగా ఉంటారు. విధానపరమైన ముఖ్య విషయాలలో మీ అభిప్రాయాలలో రాజీధోరణి ఏర్పడుతుంది. నిత్యం అష్టమూలికా గుగ్గిలంతో గృహంలోనూ, వ్యాపార కేంద్రం లోనూ ధూపం వేయడం చెప్పదగినది.


### మీనం


ఈ వారం ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కార్యసాధనలో సన్నిహితుల సహాయం తీసుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఎదురు చూస్తున్న అవకాశాలు లాభిస్తాయి. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. సోదరులు, బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. గృహం, వాహనాలు, వస్తువులు, కొనుగోలు చేస్తారు.

# ఈ వారం కార్టూన్స్


తెచ్చిన డబ్బు తెచ్చుకున్న బ్యాగులో వేసి వెళ్ళు..
కళ్ళ ముందు అవినీతి జరుగుతుంటే సహించను!!
ఆఫీసు


ఇక చాలమ్మా డ్రైటింగ్..!!


అంటే.. నేను మిమ్మల్ని ఒక
బంట్రోతు లా వాడుకుంటున్నా అనేగా..?!



ఫోటో ఫీచర్





చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లో వున్న పర్యాటక ప్రాంతమిది. దీనిని ఉలింగ్ యువాన్ నేషనల్ పార్క్ అని అంటారు. ఇక్కడ సుమారు మూడు వేలకు పైగా ఎత్తయిన పర్వతాలున్నాయి. గుహలు, జలపాతాలు, వాగులు, వంకలతో పర్యాటకులను ఆకర్షిస్తోంది.





